


PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 287, పేజీలు - 08




శనివారం, ఏప్రిల్ 4, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక HYDERABAD

## ఆయిల్, గ్యాస్‌పై అభయం

**- భారత్‌కు రష్యా హామీ**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం ప్రభావంతో ప్రపంచ మార్కెట్‌లో అనిశ్చితి నెలకుంది. అంతర్జాతీయ చమురు సరఫరాకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. ఈ సంక్షోభ సమయంలో భారత్‌కు ఊరటనిచ్చేలా రష్యా అభయం ఇచ్చింది. భారత అవసరాలకు అనుగుణంగా ఇంధన సరఫరా పెంచుతామని హామీ ఇచ్చిన రష్యా, ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని నిర్ణయించింది.

2లో..

## కాళేశ్వరంపై రేవంత్ వాదననే వినిపిస్తున్నకేంద్రం

**- బీఆర్ఎస్ ఉక్కిరిబిక్కిరి! ఎదురుదాడి చేస్తుందా.?**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ గర్వకారణంగా చెప్పుకున్న కాళేశ్వరం ప్రాజెక్టు ఇప్పుడు ఆ రాష్ట్ర రాజకీయాల్లో పెను ప్రకంపనలు సృష్టిస్తోంది. రాజ్యసభలో అమరావతి బిల్లుపై చర్చ జరుగుతున్న సమయంలో బీఆర్ఎస్ ఎంపీలు కాళేశ్వరం ప్రస్తావన తీసుకువచ్చారు. వారికి ఇదే సరైన చాన్స్ అనిపించింది. మూడు రోజుల కిందట కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ గట్టి కౌంటర్ ఇచ్చారు కాళేశ్వరం పేరుతో సుమారు లక్ష కోట్ల రూపాయల ప్రజాధనం నీళ్లపాలైందని ఆయన కుండబద్దలు కొట్టారు. ప్లానింగ్, డిజైన్ లోపాల వల్లే బ్యారేజీలు

2లో..



## తమిళిసైకు టిక్కెట్

**- అన్నామలైకు నో టిక్కెట్**

**- తమిళనాట బీజేపీ ప్రయోగాలు**





చెన్నై (ప్రశ్న న్యూస్) తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ఈసారి ఎలాగైనా సత్తా చాటుకోవాలని ప్రయత్నాలు చేస్తున్న జాతీయ పార్టీ బీజేపీ శుక్రవారం తమ అభ్యర్థుల తొలి జాబితాను విడుదల చేసింది. 27మందితో విడుదల చేసిన ఈ జాబితాలో పలు సంచలనాలు చోటు చేసుకున్నాయి, ముఖ్యంగా పార్టీ మాజీ అధ్యక్షుడు అన్నామలైకి ఈ జాబితాలో చోటు దక్కలేదు. దీంతో ఇప్పటికే పార్టీ తీరుపై అసంతృప్తిగా ఉన్న అన్నామలైకి పుండు మీద కారం చల్లినట్లయింది. తమిళనాడులో బీజేపీకి కీలక నాయకుడైన కె. అన్నామలై ఈసారి బీజేపీ

2లో..

## కవిత నోట టీఆర్ఎస్ మాట!

**- అదే పేరుతో కవిత పార్టీ పెడుతున్నారా.?**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ కు కవిత షాక్ ఇవ్వనున్నారా? కొత్త రాజకీయ పార్టీని పెడతానని ఇప్పటికే ప్రకటన చేసిన కవిత పార్టీ పేరుతో కెసిఆర్ కు కొత్త చిక్కులు తెచ్చి పెట్టనున్నారా? కవిత పార్టీతో ప్రధానంగా టార్గెట్ చేసేది బీఆర్ఎస్ నేనా? అంటే అవును అనే సమాధానమే వస్తుంది.

**- కొత్త పార్టీ పేరుపై షాకింగ్ ప్రకటన చేసిన కవిత**

కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటుపై చిట్ చాట్ లో తన అభిప్రాయాలను వెల్లడించిన కవిత తన పార్టీకి 'టీఆర్ఎస్ - తెలంగాణ రాష్ట్ర సమితి' అని పేరు పెట్టాలని యోచిస్తున్నట్లు స్పష్టం చేశారు. పాత పేరుతో కొత్త జెండా ఎలా ఉంటుందని ప్రశ్నించిన కవిత, టీఆర్ఎస్ పేరు ఖాళీగా ఉందని, ఆ పేరుతో పార్టీని ప్రారంభిస్తే బావుంటుందని అభిప్రాయపడ్డారు. జెండాలో మాత్రం గులాబీ రంగు ఉండదని ఆమె తేల్చి చెప్పారు.

**- పార్టీ రిజిస్ట్రేషన్ పై కవిత కీలక వ్యాఖ్యలు**

పార్టీ రిజిస్ట్రేషన్ కోసం ప్రత్యేక బృందం పనిచేస్తోందని పేర్కొన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ సిద్ధాంతాలే తమకు ఆధారమని, బీహార్ సిద్ధాంతాలు ఉండవని కవిత స్పష్టం



చేశారు. ఆవిర్భావం రోజున అమరవీరుల స్థూపాన్ని సందర్శిస్తామని, వేదికపై ఉద్యమకారులు ఉంటారని కవిత తెలంగాణ ఉద్యమ ప్రస్థానాన్ని తాము మరువబోమనీ స్పష్టం చేశారు. డీఎస్పీ విశారదన్ మహరాజ్‌తో కలిసి పనిచేస్తామన్నారు; కాంగ్రెస్ తమకు ప్రధాన శత్రువని ప్రకటించారు.

**- సిద్దిపేట నుండి పోటీ చేస్తానన్న కవిత**

బీఆర్ఎస్ పార్టీని 'రిచ్ పార్టీ' అంటూ కవిత తీవ్ర విమర్శలు చేశారు.

2లో..

## బీఆర్ఎస్ పార్టీ రోడ్డున పడింది

**- ప్రజలు కాంగ్రెస్ నే నమ్ముతున్నారన్న మహేష్ గౌడ్**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో బీఆర్ఎస్ తన ఉనికిని కోల్పోయిందని, బీజేపీకి ఇక్కడ స్థానం లేదని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు పన్నినా ప్రజలు కాంగ్రెస్‌నే నమ్ముతున్నారని, ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితాలే అందుకు నిదర్శనమని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పతనం ప్రారంభమైందని మహేశ్ గౌడ్ అన్నారు. ఎమ్మెల్సీ కవిత సొంతంగా వేరు కుంపటి పెట్టుకోవడంతో బీఆర్ఎస్ పరిస్థితి రోడ్డున పడిందని చెప్పారు.

2లో..

## అమరావతిని అత్యుత్తమ రాజధానిగా మారుస్తా

**- మావిగన్ పేరు కూడా పలకనన్న సీఎం చంద్రబాబు**


**- వాళ్లు నాశనం చేసారు, మేము శాసనం చేసామన్న సీఎం**

**- ఏపీ ప్రజలకు ద్రోహం చేసిన ఏకైక పార్టీ వైసీపీ అంటూ విమర్శలు**

**- 11 సీట్లకు పరిమితమైన వైసీపీకి బుద్ధి రాలేదని మండిపాటు**

**- తెలంగాణకు తానూ ఎప్పుడు వ్యతిరేకం కాదని వెల్లడి**

అమరావతి (ప్రశ్న న్యూస్) ఏపీ రాజధాని అమరావతికి పార్లమెంట్ సాక్షిగా చట్టబద్ధత లభించడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. పుష్కర కాలం కిందట తాము పునాది వేసిన అమరావతి కల ఇప్పుడు చట్టరూపం దాల్చడం శుభపరిణామమని కొనియాడారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీకి ధన్యవాదాలు తెలిపిన ఆయన, పార్లమెంట్‌లో అన్ని పార్టీలు ఈ బిల్లును సమర్థించినా, ఒక్క వైసీపీ మాత్రమే వ్యతిరేకించడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. దేశంలో అన్ని పార్టీలది ఒక దారైతే, వైసీపీది మరో దారి అంటూ ఆ పార్టీ వైఖరిని ఎండగట్టారు. తాను తెలంగాణ



అభివృద్ధికి ఎప్పుడూ వ్యతిరేకం కాదని, నిజానికి సైబరాబాద్, హైటెక్ సిటీల రూపకల్పనతో


2లో..

## కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎస్టీలకు మోసం

**- రాష్ట్ర సమస్యలు రేవంత్ గాలికి వదిలేశారన్న హరీష్**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) నారాయణపేట జిల్లా బావోజీ జాతరలో పాల్గొన్న మాజీ మంత్రి, సిద్దిపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. గిరిజనుల సంక్షేమం కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన కృషిని వివరిస్తూ, ప్రస్తుత పాలనలో గిరిజనులకు అన్యాయం జరుగుతోందంటూ మండిపడ్డారు. గిరిజన

2లో..



## 2047 నాటికి తెలంగాణను టెక్స్‌టైల్ రాజధానిగా మారుస్తాం

**- ఏషియన్ టెక్స్‌టైల్ కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్**

**- టెక్స్‌టైల్ రంగంలో పెట్టుబడిదారులకు పూర్తి సహకారం**

**- తెలంగాణలో తయారైన బట్టలను ప్రపంచమంతా ధరించేలా చేస్తాం**

**- నాణ్యమైన పత్తి, మానవ వనరులు రాష్ట్రానికి బలమని సీఎం వెల్లడి**

2లో..



## మిత్రులే లేని వైసీపీ

**- జగన్ రాజకీయం ఇంత తేడానా.?**



అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్ట సవరణ బిల్లు-2026 పార్లమెంటులో ఆమోదం పొందడం జగన్ మోహన్ రెడ్డి ఐదేళ్ల రాజకీయ వ్యూహానికి తగిలిన కోలుకోలేని దెబ్బ. దేశంలోని ప్రధాన రాజకీయ పక్షాలన్నీ అమరావతికి మద్దతుగా నిలిచాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాత్రం ఒంటరిగా మిగిలిపోయింది. జాతీయ స్థాయిలో ఆ పార్టీకి కనీసం గళం కలిపే మిత్రులు లేకపోవడం జగన్ రాజకీయ పరపతి ఏ స్థాయిలో పడిపోయిందో స్పష్టం చేస్తోంది.

**- మిత్రపక్షాల నమ్మకం కోల్పోయిన వైనం**

గతంలో ఢిల్లీ వేదికగా జగన్ నిర్వహించిన ధర్నాలకు తృణమూల్ కాంగ్రెస్, డీఎంకే, ఆమ్ ఆద్మీ పార్టీ వంటివి సంఘీభావం తెలిపాయి. కానీ అమరావతి బిల్లు విషయంలో అవే పార్టీలు వైసీపీకి కనీస మద్దతు కూడా ప్రకటించలేదు. రాజ్యసభలో కీలక బిల్లుల సమయంలో బీజేపీకి అండగా నిలిచిన జగన్, అవసరమైనప్పుడు ఇండియా కూటమి నేతలను సంప్రదించడంలో విఫలమయ్యారు. ఈ ద్వంద్వ వైఖరి వల్ల జాతీయ నేతలు జగన్ రెడ్డిని నమ్మకూడదని నిర్ణయించుకున్నారు. ఫలితంగా పార్లమెంటులో వైసీపీ వాదన వినిపించడానికి ఒక్కరు

2లో..

## కల్తీ మామిడి పండ్లతో తస్మాత్ జాగ్రత్త

**- సీపీ సజ్జనార్ కీలక హెచ్చరిక**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) వేసవి వచ్చిందంటే చాలు, పండ్లలో రారాజైన మామిడి పండ్ల కోసం అందరూ ఎదురుచూస్తుంటారు. అయితే, మార్కెట్లో కంటికి ఇంపుగా కనిపించే ఈ పండ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ హెచ్చరించారు. కాల్షియం కార్బైడ్ వంటి రసాయనాలతో కృత్రిమంగా పండిస్తున్న మామిడి పండ్లతో తస్మాత్ జాగ్రత్త అంటూ ఆయన సోషల్ మీడియా వేదికగా ప్రజలకు కీలక సూచనలు చేశారు. కొందరు స్వార్థపరులైన వ్యాపారులు, కేవలం కాసుల కక్కుర్తితో





2లో..

## ఢిల్లీని వణికించిన భూప్రకంపనలు

**- పరుగులు తీసిన జనం**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) దేశ రాజధాని ఢిల్లీతో పాటు, పరిసర ప్రాంతాల్లో శుక్రవారం భూమి కంపించింది. ఈ భూప్రకంపనలతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురై ఇళ్లు, కార్యాలయాల నుంచి బయటకు పరుగులు తీశారు. ప్రాథమిక సమాచారం ప్రకారం, ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరిగినట్లు వార్తలు రాలేదు. ఢిల్లీ, నోయిడా, గురుగ్రామ్, ఘజియాబాద్, ఫరీదాబాద్‌తో పాటు ఉత్తరప్రదేశ్, హరియాణాలోని కొన్ని ప్రాంతాల్లో ప్రకంపనల ప్రభావం స్పష్టంగా కనిపించింది. కొన్ని సెకన్ల పాటు భూమి కంపించడంతో

2లో..

# ఆయిల్, గ్యాస్‌పై అభయం

క్రూడాయిల్, ఎల్ఎన్జీ సరఫరాను పెంచగలిగే సామర్థ్యం తమ చమురు కంపెనీలకు ఉందని రష్యా పేర్కొంది. ప్రస్తుతం భారత పర్యటనలో ఉన్న రష్యా తొలి డిప్యూటీ ప్రధాని డెనిస్ మంటురావ్ హామీ ఇచ్చారు. 2025 చివరి నాటికే రష్యా కంపెనీలు భారత్‌కు మినరల్ ఫర్టిలైజర్ సరఫరాను 40 శాతం మేర పెంచాయని ఆయన గుర్తుచేశారు. భారత్- రష్యాల ద్వైపాక్షిక భాగస్వామ్యం, సంబంధాలు ఇంధన రంగానికే పరిమితం కాదని చెప్పారు. అణు ఇంధన రంగాల్లోనూ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు ఇరు దేశాలూ కృషి చేస్తున్నాయని కూడా డెనిస్ వివరించారు. కూడంకుళం అణు విద్యుత్ ప్లాంట్‌లో అదనపు పవర్ యూనిట్ల ఏర్పాటు పనులు ప్రణాళిక ప్రకారం సాగుతున్నాయని ఆయన అన్నారు. యూరియా తయారీ కోసం భారత్- రష్యా సంయుక్తంగా చేపట్టిన ప్రాజెక్టు పనులు సక్రమంగా జరుగుతున్నాయని డెనిస్ తెలిపారు. భారత్ విదేశాంగ శాఖ మంత్రి ఎస్ జైశంకర్‌తో సమావేశమైన రష్యా డిప్యూటీ ప్రధాని వాణిజ్యం, కనెక్టివిటీ, సాంకేతికత, అరుదైన మూలకాలు తదితర అంశాలపై చర్చించారు. గతేడాది జరిగిన భారత్-రష్యా 13 వార్షిక శిఖరాగ్ర సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై కూడా సమీక్షించారు. 2030 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 100 బిలియన్ డాలర్లకు చేర్చాలని నిర్ణయించారు. అణుశక్తి రంగంలోనూ సంబంధాలు బలోపేతం చేయాలని నిర్ణయించుకున్నారు. కాగా, గతేడాది నవంబరు తర్వాత రష్యా నుంచి భారత్ చమురు దిగుమతులు క్రమంగా తగ్గుముఖం పట్టాయి. ఉక్రెయిన్‌పై ఫిబ్రవరి 2022లో యుద్ధం మొదలైన తర్వాత రష్యా చమురుపై అమెరికా ఆంక్షలు విధించింది. దీంతో అప్పటి నుంచి రాయితీపై రష్యా చమురును భారత్ కొనుగోలు చేస్తోంది. జనవరి 2026లో 1.98 బిలియన్ డాలర్ల విలువైన క్రూడాయిల్‌ను దిగుమతి చేసుకుంది. గతంతో పోల్చితే దాదాపు 14 శాతం తగ్గింది.కానీ, ఫిబ్రవరి చివరిలో పశ్చిమాసియాలో యుద్ధం మొదలైనప్పటి నుంచి తిరిగి రష్యా నుంచి పెద్ద మొత్తంలో చమురు కొనుగోలు చేస్తోంది. రష్యా చమురు కొనుగోలుకు అమెరికా తాత్కాలికంగా అనుమతించడంతో దిగుమతి పెంచింది. అలాగే, మాస్కో నుంచి ఎల్ఎన్జీ కొనుగోలుకు భారత్ మినహాయింపులు కోరింది. దీనిపై ఇంకా అమెరికా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని తెలుస్తోంది.

## కాళేశ్వరంపై రేవంత్ వాదననే

# వినిపిస్తున్నకేంద్రం

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ గర్వకారణంగా చెప్పుకున్న కాళేశ్వరం ప్రాజెక్టు ఇప్పుడు ఆ రాష్ట్ర రాజకీయాల్లో పెను ప్రకంపనలు సృష్టిస్తోంది. రాజ్యసభలో అమరావతి బిల్లుపై చర్చ జరుగుతున్న సమయంలో బీఆర్ఎస్ ఎంపీలు కాళేశ్వరం ప్రస్తావన తీసుకువచ్చారు. వారికి ఇదే సరైన చాన్స్ అనిపించింది. మూడు రోజుల కిందట కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ గట్టి కౌంటర్ ఇచ్చారు కాళేశ్వరం పేరుతో సుమారు లక్ష కోట్ల రూపాయల ప్రజాధనం నీళ్లపాలైందని ఆయన కుండబద్దలు కొట్టారు. ప్లానింగ్, డిజైన్ లోపాల వల్లే బ్యారేజీలు

కుంగిపోయాయని, ప్రజలకు అందాల్సిన నీరు అందకుండా పోయిందని కేంద్రం స్పష్టం చేయడం బీఆర్ఎస్ వర్గాలను దిగ్భ్రాంతికి గురిచేసింది. దాంతో పార్లమెంట్లో అమరావతి అంశంపై చర్చలోతమ ఆక్రోశాన్ని వెలిబుచ్చారు.

**- కూలేశ్వరం విమర్శలకు పెరిగిన బలం**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మొదటి నుండి కాళేశ్వరాన్ని కూలేశ్వరం అని పిలుస్తూ వస్తున్నారు. మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిపోవడం, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో లీకేజీలు బయటపడటంతో ఆయన చేస్తున్న విమర్శలకు ఇప్పుడు కేంద్ర మంత్రి వ్యాఖ్యలు మరింత బలాన్ని చేకూర్చాయి. లక్ష కోట్ల వ్యయం చేసినా ఫలితం శూన్యమని కేంద్రం సాక్షాత్తూ పార్లమెంటులో ప్రకటించడం ద్వారా.. ఇటు కాంగ్రెస్, అటు బీజేపీ రెండు పార్టీలు బీఆర్ఎస్ హయాంలో అవినీతి జరిగిందని జాతీయ స్థాయిలో ముద్ర వేసినట్లయింది. ఇది బీఆర్ఎస్ నాయకత్వానికి మింగుడుపడని పరిణామంగా మారింది.

**- కిషన్ రెడ్డి కౌంటర్**

రాజ్యసభలో బీఆర్ఎస్ ఎంపీల నిరసనపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. కాళేశ్వరం ప్రాజెక్టును గత ప్రభుత్వం ఒక ఏటీఎం లాగా వాడుకుందని ఆయన విమర్శించారు. కేవలం కమీషన్ల కోసమే రీ-డిజైనింగ్ పేరుతో వేల కోట్లు అదనంగా ఖర్చు చేశారని విమర్శించారు. అమరావతికి అన్ని పార్టీలు మద్దతు ఇస్తున్న వేళ, బీఆర్ఎస్ సభ్యులు అనవసరంగా కాళేశ్వరం అంశాన్ని తెరపైకి తెచ్చి అబాసుపాలయ్యారని బీజేపీ నేతలు ఎద్దేవా చేస్తున్నారు. ఢిల్లీ స్థాయిలో కూడా ప్రాజెక్టు వైఫల్యంపై చర్చ జరగడం బీఆర్ఎస్ ఇమేజ్‌ను బాగా దెబ్బతీసింది.

**- విచారణ నీడలో ప్రాజెక్టు భవిష్యత్తు**

బ్యారేజీల కుంగుబాటుపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఇప్పటికే తీవ్రమైన లోపాలను ఎత్తిచూపింది. ఈ లోపాలపై ప్రస్తుతం విచారణ జరుగుతోందని, అది నెమ్మదిగా సాగుతోందని మంత్రి పాటిల్ పేర్కొన్నారు. అటు రాష్ట్రంలో విజిలెన్స్ విచారణ, ఇటు కేంద్ర సంస్థల నివేదికలు బీఆర్ఎస్ అధినాయకత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. మీద కాళేశ్వరం అంశం బీఆర్ఎస్ పార్టీకి రాజకీయంగా పెద్ద అడ్డంకిగా మారింది. అటు కాంగ్రెస్ రాష్ట్ర స్థాయిలో, ఇటు బీజేపీ జాతీయ స్థాయిలో ప్రాజెక్టు వైఫల్యాన్ని ఎండగడుతుండటంతో ఆ పార్టీ సమాధానం చెప్పుకోలేక సతమతమవుతోంది. కేవలం ఒక బ్యారేజీ కుంగిపోవడమే కాకుండా, లక్ష కోట్ల రూపాయల ప్రజాధనం వృథా అయిందనే ప్రచారం ప్రజల్లోకి బలంగా వెళ్తోంది. దీనిని కవర్ చేసుకునే క్రమంలో చేస్తున్న ప్రయత్నాలు మరింత వివాదాలకు దారితీస్తుండటంతో గులాబీ దళం ప్రస్తుతం తీవ్ర నిర్వేదంలో ఉంది.

# తమిళిసైకు టిక్కెట్

ప్రచారానికి ముఖచిత్రంగా ఉంటారని భావించినా ఆయనకు ప్రస్తుతం విడుదల చేసిన తొలి విడత అభ్యర్థుల జాబితాలో చోటు దక్కలేదు. కోయంబత్తూరు ఉత్తర నియోజకవర్గం విషయంలో నెలకొన్న ప్రతిష్టంభనే ఇందుకు కారణంగా తెలుస్తోంది. కోయంబత్తూరు ఉత్తర నియోజకవర్గానికి అన్నామలై బీజేపీ అభ్యర్థిగా ఉంటారని భావించినా పార్టీ ఆ స్థానానికి వానతి శ్రీనివాసన్‌ను తిరిగి నిలబెట్టడం పార్టీలోని అంతర్గత కలహాలకు సంకేతంగా నిలుస్తోంది. మరో సీనియర్ నాయకురాలు తమిళిసై సౌందర రాజన్ మైలాపూర్ నుంచి పోటీ చేస్తున్నారు. తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు నైనార్ నాగేంద్రన్ సత్తూర్ నుంచి బరిలోకి దిగుతున్నారు. అరంతంగి నుంచి కవిత శ్రీకాంత్, విలవన్కోడ్ నుంచి విజయ ధరణి, మొదక్కురిచ్చి నుంచి క్రితికా శివకుమార్ కు చోటు దక్కింది. వీరితో పాటు ఇతర అభ్యర్థులతో కూడిన జాబితాను అన్నామలై ట్వీట్ చేస్తూ సెటైర్లు వేశారు. అసెంబ్లీ ఎన్నికలకు ప్రకటించిన బీజేపీ విజేత అభ్యర్థులందరికీ హృదయపూర్వక అభినందనలు అన్నారు.అవినీతి, నిర్లక్ష్యం, డీఎంకే ద్రోహంతో విసిగిపోయిన తమిళనాడులోని ప్రతి సోదర సోదరీమణుల మద్దతు వారికి ఉందన్నారు. రాబోయే శాసనసభ ఎన్నికలలో ఎన్డీయే 210 సీట్లు గెలవాలనే లక్ష్యంతో, ఒక కార్యకర్తగా తాను బీజేపీతో పాటు ఇతర ఎన్డీయే పార్టీల అభ్యర్థులందరితో భుజం భుజం కలిపి నిలబడి ప్రచారం చేస్తానన్నారు.

# ఢిల్లీని వణికించిన భూప్రకంపనలు

ఇళ్లలోని ఫ్యాన్లు, ఇతర వస్తువులు ఊగిపోయాయని స్థానికులు తెలిపారు. ఆఫీసుల్లో పనిచేస్తున్న ఉద్యోగులు కూడా భవనాలను ఖాళీ చేసి, సమీపంలోని ఖాళీ ప్రదేశాలకు చేరుకున్నారు. చాలామంది తమ అనుభవాలను సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. ప్రస్తుతానికి ఎలాంటి నష్టం జరగలేదని అధికారులు చెబుతున్నారు. భూకంప కేంద్రం ఎక్కడ ఉంది, రిక్టర్ స్కేలుపై దాని తీవ్రత ఎంత నమోదైందనే వివరాలను ఇంకా అధికారికంగా వెల్లడించలేదు. అత్యవసర సేవల బృందాలను అప్రమత్తం చేసినప్పటికీ, ఎలాంటి సహాయక కాల్స్ అందలేదని తెలిసింది. అటు, జమ్ముకశ్మీర్ ప్రాంతంలోనూ ప్రకంపనలు వచ్చినట్టు తెలుస్తోంది.?

వీటి తీవ్రత రిక్టర్ స్కేలుపై 5.9గా నమోదైనట్టు సమాచారం. ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతం భూకంపాల పరంగా అత్యంత ప్రమాదకరమైన 'సిస్మిక్ జోన్ 4' పరిధిలోకి వస్తుంది. ఈ కారణంగా ఇక్కడ స్వల్ప ప్రకంపనలు కూడా విస్తృత ప్రాంతంలో ప్రభావం చూపుతాయి. ప్రజలు ఆందోళన చెందవద్దని, ప్రశాంతంగా ఉండాలని అధికారులు సూచించారు. తదుపరి ప్రకంపనలు వచ్చే అవకాశం ఉన్నందున భద్రతా ప్రమాణాలు పాటించాలని కోరారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# కవిత నోట టీఆర్ఎస్ మాట!

అది 'గుంపు మేస్త్రి, గుంట నక్క దోస్తుల' పార్టీ అని కవిత ఘాటుగా వ్యాఖ్యానించారు. మహిళా రిజర్వేషన్ వస్తే సిద్దిపేట నుంచి పోటీ చేస్తానని, గజ్వేల్ వచ్చినా పరిశీలిస్తానని ఆమె వెల్లడించారు. నిజామాబాద్‌లోని చాలా సీట్లు ఈసారి మహిళా రిజర్వేషన్ పరిధిలోకి వస్తాయని కూడా కవిత అంచనా వేశారు.

**- ఆంధ్రలో అమరావతి ఉంటే ఎంత, లేకుంటే ఎంత**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కవిత మాట్లాడుతూ, రేవంత్ రెడ్డి నగరాన్ని బాగు చేయకపోయినా పర్వాలేదు కానీ 'ఫ్యూచర్ సిటీ' పేరుతో నగరాన్ని నాశనం చేయకుండా ఉంటే చాలని వ్యాఖ్యానించారు. మహారాష్ట్రలో కాంగ్రెస్‌ను ఓడించిన రేవంత్, ఇప్పుడు కేరళలోనూ ఓడిస్తారని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. తమకు తెలంగాణ ప్రయోజనాలే ముఖ్యమని పేర్కొన్న కవిత, ఆంధ్రలోని అమరావతి ఉంటే ఎంత, లేకుంటే ఎంత, దాని గురించి పట్టించుకోబోమని స్పష్టం చేశారు.

**-నాడు కేసీఆర్ లా జాగృతి కోసం కష్టపడతా**

కేసీఆర్ కష్టపడితేనే టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిందని కవిత గుర్తుచేశారు. జాగృతి కోసం కూడా అదే విధంగా కష్టపడతానని స్పష్టం చేశారు. తన లిక్కర్ కేసు కొట్టివేతపై స్పందిస్తూ, ప్రకృతి తనకు సహకరిస్తోందని అనిపిస్తుందని వ్యాఖ్యానించారు. తెలివైనవారిని ఆపవచ్చు కానీ, అదృష్టవంతులను ఆపలేరని ఆమె అభిప్రాయపడ్డారు.

**-ఆడబిడ్డకు ఓటు వెయ్యటం ఒక భావోద్వేగం**

కష్టపడటంలో చంద్రబాబు అద్భుతమని, పార్టీ నిర్మాణం లో టీడీపీ బలంగా ఉందని కవిత ప్రశంసించారు. ఆడబిడ్డకు ఓటెయ్యడం కేవలం ఒక భావోద్వేగమని పేర్కొన్నారు. భగవద్గీతను చాలాసార్లు చదివానని, ఇంకా చదువుతున్నానని, దాని గొప్ప నీతి 'యుద్ధం చేయాల్సిందే'నని ఆమె వివరించారు.

# బీఆర్ఎస్ పార్టీ రోడ్డున పడింది

పార్టీలో కేటీఆర్, హరీశ్ రావు మధ్య ఆధిపత్య పోరు నడుస్తోందని, దీనివల్ల అంతర్గత కలహాలు తారాస్థాయికి చేరుకున్నాయని పేర్కొన్నారు. మాజీ సీఎం కేసీఆర్ రాజకీయాలకు దూరమై కేవలం తన ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారని ఎద్దేవా చేశారు. ఎన్నికలు వచ్చినప్పుడల్లా బీజేపీ దేవుడి పేరు చెప్పి ఓట్లు అడుగుతోందని, ఈ విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని ఆయన అన్నారు. అందుకే ఆ పార్టీని ప్రజలు దూరం పెడుతున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలకు పూర్తి విశ్వాసం ఉందని ధీమా వ్యక్తం చేశారు. "ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ పార్టీ క్లీన్ స్వీప్ చేస్తుంది. రాష్ట్రంలో మాకు 100 సీట్లు రావడం ఖాయం" అని ఆయన జోస్యం చెప్పారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎస్టీలకు మోసం

రిజర్వేషన్లను 6 శాతం నుంచి 10 శాతానికి పెంచిన ఘనత కేసీఆర్‌దేనని, తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చి గిరిజనులకు స్వపరిపాలన అందించారని కొనియాడారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎస్టీల కోసం బడ్జెట్‌లో రూ. 2,730 కోట్లు కేటాయించి, కేవలం రూ. 50 కోట్లు మాత్రమే ఖర్చు చేయడం గిరిజనులను వంచించడమేనని మండిపడ్డారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లగచర్లలో లంబాడీల భూములను బలవంతంగా లాక్కుని వారిని జైల్లో పెట్టారని హరీశ్ ఆరోపించారు. కేసీఆర్‌కు పేరు వస్తుందనే అక్కసుతోనే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, ప్యాకేజీ-3 పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సమస్యలను గాలికొదిలేసి ముఖ్యమంత్రి కేరళలో గొప్పలు చెప్పుకుంటున్నారని హరీశ్ ఎద్దేవా చేశారు.

# 2047 నాటికి తెలంగాణను టెక్స్‌టైల్ రాజధానిగా మారుస్తాం

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) 2047 నాటికి తెలంగాణను దక్షిణ ఆసియాకు టెక్స్‌టైల్ రాజధానిగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో జరిగిన ఏషియన్ టెక్స్‌టైల్ కాన్ఫరెన్స్ 2026లో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో తయారైన వస్త్రాలను ప్రపంచంలోని ప్రతి దేశంలో ప్రజలు ధరించేలా చేయాలన్నదే తన ఆశయమని అన్నారు. టెక్స్‌టైల్ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చే వారికి అన్ని రకాలుగా అండగా ఉంటామని సీఎం భరోసా ఇచ్చారు. పెట్టుబడిదారులకు అవసరమైన భూమి, విద్యుత్, నీరు, రాయితీలతో పాటు మౌలిక సదుపాయాలు కల్పిస్తామని, అనుమతులు కూడా వేగంగా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. "మీకు విజన్ ఉంటే, మీకు సరైన భాగస్వాములం మేమే. కలిసికట్టుగా ప్రపంచాన్ని మార్చగల టెక్స్‌టైల్ వ్యవస్థను నిర్మిద్దాం" అని ఆయన పిలుపునిచ్చారు.

తెలంగాణ వస్త్రాలకు ఘనమైన చరిత్ర ఉందని, పోచంపల్లి ఇక్కత్, గద్వాల చీరల నుంచి వరంగల్ దర్రీల వరకు ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయని సీఎం గుర్తుచేశారు. దేశంలోనే అత్యధికంగా నాణ్యమైన పత్తిని ఉత్పత్తి చేస్తున్న రాష్ట్రంగా తెలంగాణకు ప్రపంచవ్యాప్త గుర్తింపు ఉందని తెలిపారు. వరంగల్‌లో ప్రపంచ స్థాయి కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ అందుబాటులో ఉందని వివరించారు. హైదరాబాద్ ఫిల్మ్ ప్రొడక్షన్‌కు హబ్‌గా మారుతోందని, నెట్‌ఫ్లిక్స్ వంటి సంస్థలు ఇక్కడ స్టూడియోలు ఏర్పాటు చేస్తున్నాయని సీఎం అన్నారు. బాలీవుడ్‌తో పాటు ఇప్పుడు హాలీవుడ్ కూడా హైదరాబాద్ వైపు చూస్తోందని, సినిమా పరిశ్రమ ఫ్యాషన్ అవసరాలను స్థానికంగానే తీర్చేలా ప్రోత్సహిస్తామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ రాష్ట్రంలో గ్రీన్ టెక్స్‌టైల్ హబ్‌లను అభివృద్ధి చేస్తామని, యువతకు, ముఖ్యంగా మహిళలకు నైపుణ్య శిక్షణ ఇస్తామని రేవంత్ రెడ్డి వెల్లడించారు.

# మిత్రులే లేని వైసీపీ కూడా ముందుకు రాలేదు.

**- మూడు రాజధానుల సిద్ధాంతానికి పార్లమెంటు చరమగీతం**

మూడు రాజధానుల నినాదంతో ఐదేళ్ల పాటు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిని అడ్డుకున్నారన్న ఆరోపణలు ఇప్పుడు పార్లమెంటు సాక్షిగా బలపడ్డాయి. అమరావతికి చట్టబద్ధత కల్పించడం ద్వారా జగన్ ప్రతిపాదించిన మూడు రాజధానుల సిద్ధాంతాన్ని దేశవ్యాప్త పార్టీలు ఏకగ్రీవంగా తిరస్కరించినట్లయింది. వైసీపీ ఎంపీలు సభలో నిలబడి తమ వాదన వినిపించే ధైర్యం చేయలేకపోయారు. చర్చ నుంచి వాకౌట్ చేసి పారిపోవడం జగన్ పంతానికి ఎదురైన పరాజయంగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

**- దెబ్బతిన్న జాతీయ ప్రతిష్ఠ**

రాజకీయాల్లో విశ్వసనీయత చాలా ముఖ్యం. కాంగ్రెస్ నుండి బయటకు వచ్చిన తర్వాత జగన్ తన అవసరాలకు తగ్గట్టుగా అటు బీజేపీకి, ఇటు విపక్షాలకు చేరువయ్యే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఏ పక్షానికీ ఆయన పూర్తిస్థాయి మిత్రుడు కాలేకపోయారు. అమరావతి బిల్లు రూపంలో ఒక స్పష్టమైన వైఖరి తీసుకోవాల్సిన సమయం వచ్చేసరికి ఏ ఒక్క పార్టీ కూడా వైసీపీ పక్షాన నిలబడలేదు. ఒకప్పుడు చక్రం తిప్పాలని భావించిన నేతకు ఇప్పుడు ఢిల్లీలో కనీసం మాట వినే నాథుడు లేని స్థితి రావడం ఆశ్చర్యకరం.

**- జగన్ చాణక్యం విఫలం**

అమరావతి బిల్లు ఆమోదం పొందడం ద్వారా జగన్ ఐదేళ్ల పాలన, ఆయన రాజకీయ చాణక్యం రెండూ విఫలమయ్యాయని తేలిపోయింది. ఇది కేవలం రాజధాని అంశం మాత్రమే కాదు, భవిష్యత్తులో వైసీపీ జాతీయ రాజకీయాల్లో ఎదుర్కోబోయే గడ్డు పరిస్థితులకు ముందస్తు హెచ్చరిక. రాష్ట్రంలో అధికారం కోల్పోయి, కేంద్రంలో మిత్రులు లేక వైసీపీ ఇప్పుడు దిక్కుతోచని స్థితిలో పడిపోయింది. సొంత పార్టీ నేతలు సైతం జాతీయ స్థాయిలో ఎదురైన ఈ అవమానాన్ని చూసి నిర్వేదంలో మునిగిపోయారు.

ఇతర రాష్ట్రాల ఎంపీలు సైతం ఏపీకి ఒకే రాజధాని ఉండాలని, అమరావతికి న్యాయం జరగాలని కోరడం జగన్ రెడ్డికి వ్యక్తిగతంగా పెద్ద ఎదురుదెబ్బ. ప్రజల మనోభావాలకు విరుద్ధంగా నిర్ణయాలు తీసుకుంటే జాతీయ స్థాయిలో కూడా మద్దతు లభించదని ఈ పరిణామం రుజువు చేసింది. ఐదేళ్ల పాటు సాగించిన వింత ప్రయోగాలు ఏపీ ప్రతిష్ఠను దిగజార్చడమే కాకుండా, వైసీపీని రాజకీయంగా ఏకాకిని చేశాయి.

# కల్తీ మామిడి పండ్లతో తస్మాత్ జాగ్రత్త

ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సహజ సిద్ధంగా కాకుండా, కాల్షియం కార్బైడ్ వంటి ప్రమాదకర రసాయనాలను ఉపయోగించి మామిడి కాయలను పండ్లుగా మారుస్తున్నారని ఆరోపించారు. రోడ్డు పక్కన నిగనిగలాడుతూ, ఒకే రకమైన పసుపు పచ్చ రంగులో ఆకర్షణీయంగా కనిపించే పండ్లను చూసి మోసపోవద్దని సూచించారు.

సహజంగా పండిన పండు అన్నిచోట్లా ఒకే రంగులో ఉండదని, కానీ రసాయనాలతో పక్వానికి తెచ్చిన పండు పైన పసుపుగా ఉన్నా లోపల పచ్చిగా, రుచిహీనంగా ఉంటుందని వివరించారు. ఇలాంటి కల్తీ పండ్లను తినడం ప్రాణాంతకం కాగలదని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారని సజ్జనార్ తెలిపారు. వీటిని తినడం వల్ల తక్షణమే గొంతు మంట, కడుపులో వికారం, వాంతులు, విరేచనాలు వంటి సమస్యలు వస్తాయని పేర్కొన్నారు. అంతేకాకుండా, ఈ రసాయనాలు శరీరంలోకి చేరడం వల్ల దీర్ఘకాలంలో నాడీ వ్యవస్థ తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం ఉందని, శ్వాసకోశ సంబంధిత వ్యాధులు కూడా తలెత్తవచ్చని వివరించారు. ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే ఇలాంటి కల్తీ వ్యాపారాలపై హైదరాబాద్ పోలీస్ విభాగం ఉక్కుపాదం మోపుతోందని సజ్జనార్ స్పష్టం చేశారు. ఇప్పటికే హెచ్-ఫాస్ట్ (హైదరాబాద్ ఫుడ్ అడల్టరేషన్ సర్వైలెన్స్ టీమ్) బృందాలు నగరంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నాయని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పండ్ల రూపాన్ని చూసి కాకుండా, సహజత్వాన్ని గమనించి కొనుగోలు చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అసాధారణ రంగు, రసాయన వాసన, వింత రుచి ఉన్న పండ్లకు దూరంగా ఉండాలన్నారు. ఎక్కడైనా కల్తీ మామిడి పండ్లను విక్రయిస్తున్నట్లు సమాచారం ఉంటే వెంటనే డయల్ 100కు గానీ, హెచ్-ఫాస్ట్ వాట్సాప్ నంబర్ 8712661212కు గానీ ఫిర్యాదు చేయాలని కోరారు.

# అమరావతిని అత్యుత్తమ రాజధానిగా మారుస్తా

తెలంగాణ తన బ్రెయిన్ చైల్డ్ అని చంద్రబాబు గుర్తుచేశారు. విభజన సమయంలో రెండు రాష్ట్రాలకు న్యాయం జరగాలని కోరుకున్నానని, కానీ రాజధాని కూడా లేకుండా ఏపీని విడదీయడం అన్యాయమని పేర్కొన్నారు. ఆ క్లిష్ట పరిస్థితుల్లో తన అనుభవంతో పోలవరం ముంపు మండలాలను ఏపీలో విలీనం చేయించానని, అవి కలిపితేనే తాను ముఖ్యమంత్రిగా ప్రమాణం చేస్తానని పట్టుబట్టి సాధించుకున్నానని నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.జగన్ ప్రతిపాదించిన మావిగన్ వంటి వింత పేర్లపై చంద్రబాబు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఆ పేరు చెప్పడానికి కూడా నాకు ఇష్టం లేదు అంటూ కౌంటర్ ఇచ్చారు. 2014లోనే 9 నగరాల కలయికతో ప్రపంచ స్థాయి రాజధానిగా అమరావతిని ప్లాన్ చేశామని, కానీ గత పాలకులు కుట్రలతో, నేరాలతో దాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారని ఆరోపించారు. రైతులను రెచ్చగొట్టినా వారు వెనక్కి తగ్గకుండా భూములు ఇచ్చారని, అమరావతి రైతుల త్యాగం వృథా పోదని భరోసా ఇచ్చారు. ఒకప్పుడు హైదరాబాద్ కంటే అమరావతిలోనే భూముల ధరలు ఎక్కువగా ఉండేవని చంద్రబాబు గుర్తుచేశారు. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ చుట్టూ భూములు ఇచ్చిన వారు ఎలాగైతే లాభపడ్డారో, భవిష్యత్తులో అమరావతి రైతులు కూడా అదే స్థాయిలో ఆర్థికంగా ఎదుగుతారని ధీమా వ్యక్తం చేశారు. ఏపీలో అపారమైన వ్యవసాయ భూములు ఉన్నాయని, సరైన ప్రణాళికతో అభివృద్ధి చేస్తే హైదరాబాద్‌ను మించిన సంపదను సృష్టించవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. గత పాలకుల తీరును ఉద్దేశించి మాట్లాడుతూ గతంలో వారిని సైకోలు అనేవారు, ఇప్పుడు అవన్నీ మాట్లాడదలుచుకోలేదు అంటూ పరోక్షంగా జగన్మోహన్ రెడ్డిపై విమర్శలు సంధించారు. వైసీపీ నేతలు గతంలో మంత్రులుగా ఎలా పనిచేశారో అర్థం కావడం లేదని, వారి కుట్రలు ఇక సాగవని హెచ్చరించారు. భగవంతుడు తనకు రెండు గొప్ప అవకాశాలు ఇచ్చాడని, ఒకప్పుడు హైదరాబాద్‌ను ప్రపంచ పటంలో నిలిపినట్లే, ఇప్పుడు అమరావతిని అత్యుత్తమ రాజధానిగా నిర్మిస్తానని చంద్రబాబు శపథం చేశారు.

# రణానంతరం మహోన్నత సేవ

**- ముగ్గురికి ప్రాణదానం చేసిన పోలీస్ సోదరుడు**



అంబర్‌పేట పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న కంబాల శంకర్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి బ్రెయిన్ డెడ్ కావడం అత్యంత విషాదకర ఘటనగా నిలిచింది. విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేసిన శంకర్ ఆకస్మికంగా మృతిచెందడం పోలీస్ శాఖలోనే కాకుండా స్థానిక ప్రజల్లో కూడా తీవ్రగ్భ్రాంతిని కలిగించింది.అయితే పుట్టెడు దుఃఖంలోనూ శంకర్ కుటుంబ సభ్యులు తీసుకున్న నిర్ణయం సమాజానికి ఆదర్శంగా నిలిచింది. తన కుమారుడు ఇక లేడన్న బాధను పక్కన పెట్టి, మరొకరి ప్రాణాలు కాపాడాలనే గొప్ప సంకల్పంతో ఆయన తండ్రి అవయవ దానం చేయడానికి ముందుకు వచ్చారు.శంకర్ అవయవాలను రెండు కిడ్నీలు మరియు లివర్ దానం చేయడంతో ముగ్గురు ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులు కొత్త జీవితం పొందారు. ఈ మహోన్నత నిర్ణయం ద్వారా శంకర్ మరణానంతరం కూడా జీవించి ఉన్నట్లే అని పలువురు అభిప్రాయపడుతున్నారు.సమాజంలో అవయవ దానం పట్ల అవగాహన పెంచేలా ఈ సంఘటన నిలిచింది. శంకర్ కుటుంబ సభ్యులు చూపిన ఉదారత, మానవత్వం నిజంగా అభినందనీయం. వారి త్యాగం మరెందరికో స్ఫూర్తిగా నిలవనుం

# జర్నలిస్టుల సమస్యలను పరిష్కరిస్తా

**- కలెక్టర్ రాజర్షి షా**

**అదిలాబాద్,ఏప్రిల్ :03** తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్(టీ.ఎస్.జె.యు)జిల్లా నూతనంగా ఎన్నుకోబ డిన కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ సమావేశ కార్యాలయంలో కలెక్టర్ రాజర్షి షా ను మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రాన్నీ అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నూతనంగా ఎన్నుకొబడిన జిల్లా అధ్యక్షుడు రాగం సుభాష్,ప్రధాన కార్యదర్శి మేడపట్ల సాయన్న,ఉపాధ్య క్షులు పసుపుల స్వామిలకు శుభాకాంక్షలు తెలియజే శారు.ఈ సందర్భంగా యూని యన్ నాయకులు జర్నలిస్టు లు ఎదుర్కొంటున్న సమస్య లను ఆయన దృష్టికి తీసుకు వచ్చారు.ఇందులో ప్రధానంగా అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడేషన్ కార్డులను మంజూరు చేయడంతో పాటు హెల్త్ కార్డులు అన్ని ప్రైవేటు ఆసు పత్రులలో చెల్లుబాటు అయ్యే విధంగా చూడాలని,అర్హులైన జర్నలిస్టుల అందరికీ ఇల్లు, ఇంటి స్థలాలు ఇవ్వవలసింది గా కోరారు.దీనిలో భాగంగా జర్నలిస్టులపై దాడులు జరు గుతున్న సందర్భంలో అటాక్స్ కమిటీని జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసి రక్షణ కల్పించా ల్సిందిగా విజ్ఞప్తి చేశారు.దీనిపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్ సమస్యల పరిష్కారా నికి చొరవ చూపుతామని వీటిని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తాను అని బరోసా ఇచ్చారు.యూనియన్ కోశాధికారి అమృత్,ఓకే ప్రచార కార్యదర్శి మిలింద్, యూనియన్ గౌరవ అధ్యక్షు లు నరేష్ కదం,సహాయ కార్యదర్శి ఆర్కసంతోష్ తో పాటు మిగతా సభ్యులు దీపక్ ఎమ్ముర్లవార్,అనిల్ పవర్,అడ్డిగం మోహన్,శంకర్ తదితరులు ఉన్నారు.

# దొడ్డి కొమురయ్య 99 వ వేడుకలు

**- జూకంటి ప్రవీణ్ కుమార్**

**రాజాపేట** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు అమరజీవి దొడ్డి కొమురయ్య 99వ జయంతి సందర్భంగా శుక్రవారం రాజపేట మండల కేంద్రంలో మండల కురుమ సంఘం ఆధ్వర్యంలో ఆ మహనీయుని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జూకంటి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ భూమికోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం, దొడ్డి కొమురయ్య సాగించిన పోరాటం అజరామమైందన్నారు. పీడిత వర్గాల విముక్తి కోసం ఆ మహనీయుడు చేసిన త్యాగాన్ని వెలకట్టలేమన్నారు. దొడ్డి కొమరయ్య పోరాట స్ఫూర్తితో తెలంగాణ సమాజం ముందుకు సాగాలన్నారు. అ మహనీయుని స్మారకార్థంగా హైదరాబాదులో స్మారక కేంద్రం తో పాటు ట్యాంక్ బండ్ పై నిలువెత్తు విగ్రహం ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో కురుమ సంఘం నేతలు గౌర బక్కయ్య, రేగు సిద్ధులు జన్నె సిద్దులు, ఎమ్మ శ్రీను, కోరే వెంకటయ్య ,పోసుగొండ మధు, రావుల ఉపేందర్ వివిధ సంఘాల నేతలు నెమిల కేదారి గౌడ్, రేగు శ్రీశైలం, కొజ్జిగ వీరయ్య ఏమ్మ బాలరాజు, కొలనుపాక బాలయ్య, కర్రె కిష్టయ్య బైకని బిక్షపతి, బచ్చని నర్సింలు దయ్యాల రవి, బండి స్వామి కనకయ్య, జూకంటి సిద్దులు నారపాక కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

# రెండు లారీలు ఢీ...

## తృటిలో తప్పిన పెను ప్రమాదం...





**తిరుపతి** చెన్నై తిరుపతి జాతీయ రహదారిలో ఆగి ఉన్న లారీని వెనుక నుంచి మరో లారీ ఢీకొంది. వడమాల పేట అంజేరమ్మ కనుమ సమీపంలోని గోశాల వద్ద ఘటన జరిగింది. ఢీ కొన్న లారీ నుజ్జునుజ్జు అయింది. డ్రైవర్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. క్షతగాత్రుడు తమిళ నాడు చెన్నై కి చెందిన భాస్కర్ గా (50)గుర్తించారు. క్షతగాత్రున్ని ప్రథమ చికిత్స నిమిత్తం పుత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి, . తర్వాత మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తరలిం చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

# కేబీఆర్ పార్క్ దగ్గర ట్రాఫిక్ డైవర్షన్

**హైదరాబాద్..** హైదరాబాదులోని కేబీఆర్ పార్కు చుట్టూ జరుగుతున్న స్టీల్ బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా ట్రాఫిక్ డైవర్షన్ న్ ట్రయల్ రన్ నిర్వహిస్తున్నమని నగర్ జాయిట్ సీపీ ట్రాఫిక్ జోయెల్ డెవిస్ వెల్లడించారు. కేటీఆర్ పార్క్ చుట్టూ ట్రాఫిక్ పర్యవేక్షణ కోసం ఒకరోజు వన్ వే ఏర్పాటు చేసారు. వచ్చే ఆదివారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు మూడు గంటల పాటు వన్ వే ట్రయల్ రన్ నిర్వహించనున్నాం. ఈ నెల 5వ తేదీన నిర్వహించబోతున్న ట్రాఫిక్ ట్రయల్ డైవర్షన్ రన్ ప్రజలందరూ గమనించాలని అన్నారు. రానున్న రోజుల్లో ప్రస్తుతం ఏర్పాటు చేయబోతున్న ట్రయల్ రన్ రూట్లోనే వాహన రాకపోకలను కొనసాగిస్తాం.

పంజాగుట్ట నుండి వచ్చే వాహనాలు మాదాపూర్ కు వెళ్లేందుకుగాను రోడ్ నెంబర్ 2 లో డైవర్షన్ తీసుకొని ఇందిరానగర్, జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 5, రోడ్ నెంబర్ 10 మీదుగా మాదాపూర్ రోడ్ నెంబర్ 45 కి వెళ్లేందుకు వన్ వే ను ఏర్పాటు చేయబోతున్నాం. రోడ్ నెంబర్ 45 నుండి పంజాగుట్ట వైపు వచ్చే వాహనాలను జూబ్లీహిల్స్ చెక్పోస్ట్ మీదుగా కేబిఆర్ పార్క్ ముందు నుండి వన్వే లో భాగంగా రోడ్ నెంబర్ టు వైపు మళ్ళి ఇస్తాం. రోడ్ నెంబర్ 10, 12 నుండి వచ్చే వాహనాలన్నీ అగ్రసేన్ మహారాజ్ జంక్షన్ నుండి జర్నలిస్ట్ కాలనీ బాలకృష్ణ ఇంటి ముందు నుండి జూబ్లీ చెక్పోస్ట్ మీదుగా కేబీఆర్ పార్కు చేరుకునే విధంగా డైవర్షన్ ఏర్పాటు చేస్తున్నాం. హైదరాబాద్ ప్రజలందరికీ హైదరాబాద్ ట్రాఫిక్ అడ్వైజరీ లో భాగంగా తెలియజేస్తున్న సూచనలను పాటించి ప్రజలందరూ సహకరించాలని అయన అన్నారు. ..

## వైసిపి ఐడెంటి కార్యక్రమాన్ని

# త్వరగా పూర్తి చేయాలి

**బ్రహ్మంగారిమఠం** బ్రహ్మంగారిమఠం వైయస్సార్సీపి నాయకులకు కార్యకర్తలకు పంచాయతీ అధ్యక్షులకు తెలియజేయడమేమనగా వెరిఫికేషన్ కార్యక్రమాన్ని త్వరిత గతిన పూర్తి చేయాలని బ్రహ్మంగారిమఠం వైసిపి మండల అధ్యక్షుడు మేకల రత్నకుమారి యాదవ్ పిలుపునిచ్చారు. ముఖ్యంగా వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ గ్రామస్థాయి నుండి బలోపేతం చేయడానికి పార్టీ ఐడెంటి కార్డు ప్రవేశపెట్టడం జరిగింది. కనుక పార్టీ ఐడెంటి కార్డు కోసం వెరిఫికేషన్ ప్రక్రియ జరుగుతున్నది. ఇప్పటివరకు వెరిఫికేషన్ ప్రక్రియ 25% మాత్రమే జరిగినది మిగతా 75% వెరిఫికేషన్ ప్రక్రియ జరగలేదు. కనుక వెరిఫికేషన్ ప్రక్రియకు చివరి తేదీ ఈ నెల 10వ తేదీ కనుక మిగిలిన 75% వెరిఫికేషన్ ప్రక్రియ వివిధ పంచాయతీల అధ్యక్షులు అందరూ ఏ పంచాయతీకి సంబంధించిన అధ్యక్షుడు ఆ పంచాయతీకి వెరిఫికేషన్ ప్రక్రియ తొందరగా చేయాలని తెలియజేస్తున్నామని మేకల రత్నకుమార్ పేర్కొన్నారు.

## రాజధానిని మార్చటం ఇక ఎవరి తరం కాదు

**- ఏవి సుబ్బారెడ్డి**



**ఆళ్లగడ్డ** ఇకపై రాజధానిని మార్చటం ఎవరి తరం కాదని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్, సీనియర్ టీడీపీ నాయకులు ఏవీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆళ్లగడ్డ పట్టణంలోని ఏవి ప్లాజా ఆవరణంలో స్థానిక టీడీపీ నాయకులు కార్యకర్తలు అమరావతి రాజధానిగా బిల్లు ఆమోదం పొందిన సంతోషంలో సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏవీ సుబ్బారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిన్న పార్లమెంటులో బిల్ ఆమోదం పొందినందుకు సంతోషం వ్యక్తం చేశారు.దాదాపు ఏడు సంవత్సరాలుగా మన రాష్ట్రానికి రాజధాని లేకుండా ఉండటం ఆవేదన కలిగించిందని అయితే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు .ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లోకేష్ బాబు చొరవతో రాజధానిగా అమరావతిని ఏర్పాటు చేసి భవిష్యత్తులో ఎవరు మార్చలేని విధంగా పార్లమెంటులో బిల్లును ఆమోదం చేయించిన ముఖ్యమంత్రి కి ఉప ముఖ్యమంత్రికి మంత్రి లోకేష్ బాబుకు,ప్రధాని మోదీ కి, కేంద్ర హోమ్ మినిస్టర్ అమిత్ షా కి ఏవీ సుబ్బారెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే రానున్న రోజుల్లో ప్రభుత్వ కార్యక్రమాలలో బీజేపీ నాయకులను మరియు జనసేన పార్టీ నాయకులను కలుపుకొని వెళతానని ఏవి స్పష్టం చేశారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు చేశారు.

# మహిళా ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

**- జిల్లా రెవిన్యూ అధికారి మల్లికార్జునుడు కు యుటిఎఫ్ జిల్లా శాఖ వినతి.**



**బద్వేలు** ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే మహిళా ఉపాధ్యాయులకు తగు రక్షణ కల్పించడంతోపాటు, వారు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణం పరిష్కరించాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు లు కలెక్టర్ కార్యాలయ జిల్లా రెవిన్యూ అధికారి మల్లికార్జునుడుకు విజ్ఞప్తి చేశారు. శు క్రవారం సాయంత్రం కడపలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా రెవెన్యూ అధికారి మల్లికార్జునుడుకు యుటిఎఫ్ జిల్లా శాఖ పక్షాన వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులలో 50 శాతం మంది మహిళలే ఉన్నారన్నారు. మహిళా ఉపాధ్యాయులకు వారు పనిచేసే పాఠశాలల్లో అనేకచోట్ల కనీస సౌకర్యాలు కూడా లేవని, కొన్నిచోట్ల లైంగిక వేధింపులు, భద్రతా సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. ఇటీవల కాలంలో మహిళా ఉపాధ్యాయులపై అఘాయిత్యాలు చోటు చేసుకున్న సంఘటన సైతం ఉన్నాయని పేర్కొన్నారు. మహిళా ఉపాధ్యాయుల పట్ల లైంగిక వేధింపులకు, అఘాయిత్యాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, అందుకు ప్రత్యేక చట్టాలను రూపొందించాలని వారు డిమాండ్ చేశారు. పాఠశాలల్లో సెలవులు వినియోగించుకోవడంలో కూడా మహిళలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తున్నదని, ఒకపక్క కుటుంబ బాధ్యతలు, మరో ప్రక్క విధి నిర్వహణ రెండింటినీ సమన్వయం చేసుకుంటూ శ్రమించి పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయుల సంక్షేమానికి, రక్షణకు ప్రభుత్వం చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రతి ఉన్నత పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులకు ప్రత్యేక స్టాఫ్ రూమ్ ఏర్పాటు చేయాలని, ప్రత్యేక టాయిలెట్స్, వాష్ రూమ్స్ నిర్మించాలని పేర్కొన్నారు. ఎమ్మార్సీల నుండి పుస్తకాలు, ప్రశ్నా పత్రాలు తీసుకురావడం, రైస్ ఇండెంట్ ఇవ్వడం లాంటి పనుల నుండి మినహాయింపు కల్పించాలన్నారు. మహిళా టీచర్ల భద్రత నిమిత్తం ఒక ప్రొటెక్షన్ సెల్ జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని, ఒత్తిడిని తగ్గించేందుకు ప్రతి ఉన్నత పాఠశాలలో స్ట్రెస్ మేనేజ్మెంట్ కౌన్సిలర్ ను ఏర్పాటు చేయాలని, పిల్లల అనారోగ్యం, చదువుల నిమిత్తం మాత్రమే కాకుండా పెళ్లి అయిన బిడ్డలకు తీవ్ర అనారోగ్యం, శస్త్ర చికిత్స మరియు డెలివరీ సమయాలలో కూడా వినియోగించుకునే విధంగా చైల్డ్ కేర్ లీవ్ లో మార్పులు చేయాలని విజ్ఞప్తి చేశారు. తల్లిదండ్రులు, అత్తమామల సంరక్షణకు సంవత్సరానికి 10 రోజులు పేరెంట్ కేర్ లీవ్ మంజూరు చేయాలని, జిల్లాస్థాయిలో ఉచిత న్యాయ సలహా కేంద్రాలను ఏర్పాటు చేయాలని వారు కోరారు.

యుటిఎఫ్ వినతి పై జిల్లా రెవెన్యూ అధికారి జిల్లా రెవెన్యూ అధికారి మల్లికార్జునుడు మాట్లాడుతూ మహిళా ఉపాధ్యాయులకు రక్షణ కల్పించేందుకు తగు చర్యలు తీసుకుంటామని, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ట్రెజరర్ కె.నరసింహారావు, జిల్లా కార్యదర్శులు సి.వి.రమణ, ఎస్.ఎజాస్ అహ్మద్, జె.సుబ్బారెడ్డి, డి.సుబ్బారావు, వీరనారాయణ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డి.క్రిష్ణారెడ్డి మహిళ నాయకురాళ్ళు మేరీ ప్రసన్న, రామసుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

# అధికారుల పై మంత్రి అసహనం..

- **ఇరిగేషన్ పనుల అంచనాల తయారీలో అధికారుల అలసత్వం**
- **అధికారులు తీరు మార్చుకోవాలన్న మంత్రి నిమ్మల**
- **ఆదివారంలోగా అంచనాలు సమర్పించాలని ఆదేశం**
- **సిఈలతో వీడియో కాన్ఫరెన్స్ లో మంత్రి నిమ్మల రామానాయుడు**



**అమరావతి** గత ప్రభుత్వంలో వ్యవహరించినట్లుగా కాకుండా, ఇరిగేషన్ అధికారులు తీరు మార్చు కోవాలని హెచ్చరించారు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు. శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సిఈలతో వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడిన మంత్రి నిమ్మల నియోజకవర్గాల వారీగా కాలువల్లో తూడు, గుర్రపుడెక్క, పూడికతీత, వంటి పనులకు సంబందించిన అంచనాల తయారీపై సమీక్ష నిర్వహించారు. ఆయా పనులకు సంబందించి మార్చి 25వ తేదీలోపు నియోజకవర్గాల వారీగా అంచనాలు రూపొందించి పంపించాలని ఆదేశించినా, ఇప్పటి వరకు కొంత మంది చీఫ్ ఇంజనీర్లు సరిగా అంచనాలు సమర్పించకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు.కాలువల్లో తూడు, గుర్రపుడెక్క, మట్టి పూడిక తీత వంటి పనులు చేయడానికి ఏప్రియల్, మే, నెలలో మాత్రమే అవకాశం ఉంటుంది. ఆతరువాత ఖరీఫ్ సీజన్ మొదలైతే పనులు చేయడానికి అవకాశం ఉండదని, గతంలో ఏప్రియల్, మే నెలలో చేయాల్సిన పనులకు జూన్ లో అనుమతులు ఇచ్చేవారని, పనులు మొదలుపెట్టిన వెంటనే కాలువలకు నీళ్ళు వదిలేవారని, దీంతో పనులు సగంలోనే వదిలేయాల్సి వచ్చేదని గుర్తు చేశారు. ఇలా చేయడం వల్ల ఆయకట్టు చివరన ఉన్న పొలాలకు సాగు నీరందక రైతులు ఇబ్బందిపడాల్సి వస్తుందని, ఇలా గతంలో వ్యవహరించిన తీరులో కాకుండా ముందుగానే అంచనాలు రూపొందించి, ఆర్దిక శాఖ అనుమతులు పొందితే సీజన్ మొదలయ్యేలోగా పనులు కూడా పూర్తి చేయడానికి అవకాశం ఉంటుందని అన్నారు. కావున నియోజకవర్గాల వారీగా పనులకు సంబందించిన అంచనాలను ఆదివారం సాయంత్రం లోగా పంపాలని సిఈలను ఆదేశించారు. గడువులోగా అంచనాలను పంపని అధికారులు సోమవారం అమరావతి సచివాలయంకు వచ్చి అంచనాలు ఎందుకు పంపలేకపోయారో సంజాయిషీ ఇచ్చుకోవలసి ఉంటుందని తీవ్రంగా హెచ్చరించారు మంత్రి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అత్యవసర పనుల కింద నిధులు విడుదల చేసి, కాలవల్లో పూడిక తీత, తూడు, గుర్రపుడెక్క తొలగింపు వంటి పనులను చేయడం ద్వారా ఆయకట్టు రైతులకు సాగునీరందించగలిగామని తెలిపారు. గత 5ఏళ్ళ వైసిపి ప్రభుత్వ పాలనలో కనీస నిర్వహణ పనులు సైతం పట్టించుకోకపోవడంతో ఆయకట్టు చివరి ఎకరం వరకు నీరందక రైతులు ఇబ్బంది పడ్డారని, నేడు కూటమి ప్రభుత్వం ప్రతి ఎకరాకు సాగు నీరందించడమే లక్ష్యంగా పెట్టుకుని పని చేస్తున్నామని స్పష్టం చేశారు. కావున అధికారులు నిర్లక్ష్యం వదిలి గడువులోగా ఇరిగేషన్ పనులకు సంబందించిన అంచనాలు సమర్పించి, సీజన్ మొదలయ్యేలోగా, నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

# అపదలో ప్రాణదాతగా 108 సేవలు

- **గత 3 నెలల్లో 9,183 మంది గుండెపోటు బాధితులకు పునర్జన్మ**
- **కాలంతో పోటీపడి ప్రాణాలు కాపాడుతున్న 108 అత్యవసర సేవలు**

**అమరావతి,:**-ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా భవ్య హెల్త్ సర్వీసెస్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న 108 అత్యవసర సేవలు అత్యంత వేగంగా స్పందిస్తూ ప్రాణాలను కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి.

అత్యంత ప్రమాదకరమైన గుండెపోటు కేసుల్లో సమయానుకూలంగా స్పందించి, గత మూడు నెలల కాలంలోనే 9,183 మంది బాధితులను మృత్యువు అంచున నుంచి కాపాడటం ఒక విశేష విజయంగా నిలిచిందని 108 సేవల విభాగం వెల్లడించింది. 108 అంబులెన్స్ సేవలు కేవలం రవాణా వ్యవస్థ కాకుండా, అత్యవసర వైద్య సేవల మొబైల్ విస్తరణగా పనిచేస్తూ, ప్రాణాలను కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. సమగ్ర ప్రీ-హాస్పిటల్ కేర్, శిక్షణ పొందిన సిబ్బంది, ఆధునిక సాంకేతికత, 24/7 వైద్య పర్యవేక్షణతో 108 సేవలు ప్రజలకు భరోసానిచ్చే ప్రాణదాతగా నిలుస్తున్నాయి.గుండెపోటు వచ్చిన తర్వాత తొలి గంటను 'గోల్డెన్ అవర్'గా పరిగణిస్తారు. ఈ సమయంలో సరైన వైద్యం అందితే ప్రాణాలను రక్షించే అవకాశాలు గణనీయంగా పెరుగుతాయి. ఈ కీలక సమయంలో 108 అంబులెన్స్ సిబ్బంది వేగంగా స్పందించి, సంఘటన స్థలానికి చేరుకుని అంబులెన్స్‌లోనే ప్రాథమిక అత్యవసర చికిత్స అందించడం ద్వారా అనేక మంది ప్రాణాలను కాపాడుతున్నారు.108 అంబులెన్స్ సేవలు కేవలం రోగులను ఆసుపత్రికి తరలించడమే కాకుండా, ఆసుపత్రికి చేరుకునేలోపే ప్రాణరక్షక వైద్య సేవలను అందిస్తున్నాయి. శిక్షణ పొందిన ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్స్ రోగి పరిస్థితిని అంచనా వేసి, ఆక్సిజన్ అందించడం, అఖఖీ చేయడం, రక్తపోటు నియంత్రణ, బేసిక్ లైఫ్ సపోర్ట్ వంటి అత్యవసర చర్యలను వెంటనే ప్రారంభిస్తారు.ప్రైవేట్ అంబులెన్స్‌లతో తేడా 108 ప్రత్యేకతప్రైవేట్ అంబులెన్స్‌లు ప్రధానంగా రవాణాపైనే దృష్టి సారిస్తే, కూటమి ప్రభుత్వంలో 108 సేవలు పూర్తి స్థాయి వైద్య సేవలను అందించే మొబైల్ ఎమర్జెన్సీ యూనిట్‌గా పనిచేస్తున్నాయి. వైద్య పరికరాలు, శిక్షణ పొందిన సిబ్బంది, రియల్ టైమ్ వైద్య మార్గదర్శకంతో 108 సేవలు ప్రజలకు మరింత భరోసాను కల్పిస్తున్నాయి.

## విశాఖలో గుడ్ ఫ్రైడే

# వేడుకలు

**విశాఖపట్నం**విశాఖలోని గురజాడ కళాక్షేత్రంలో పిజే స్టీఫెన్ పాల్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో గుడ్ ఫ్రై డే ప్రార్థనలు ఘనంగా జరిగాయి. వేలాదిగా హాజరైన క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. దైవజనులు పిజే స్టీఫెన్ పాల్ వాక్య సందేశం అందించారు. సమస్త మానవాళి పాప పరిహార నిమిత్తం క్రీస్తు ప్రాణ త్యాగం చేశారని, ఏసు క్రీస్తు పవిత్ర రక్తమే మానవుల రక్షణకు, పాప పరిహారానికి మార్గమని సిస్టర్ షైలా పాల్ అన్నారు. మానవుల కోసం ఏసు క్రీస్తు ప్రాణాలు అర్పించాడానికి మించిన త్యాగం మరొకటి లేదని ఆమె అన్నారు. ఈ సందర్భంగా ప్రపంచమంతా యుద్ధాలను పక్కన పెట్టి శాంతిని నెల్కొల్పాలని ఆకాంక్షించారు.

## ప్రభుత్వ సేవలపై

# నమ్మకం కలిగించాలి

**శ్రీకాకుళం** ప్రభుత్వ సేవలపై ప్రజలకు మరింత నమ్మకం కలిగేలా, సానుకూల దృక్పథం పెంపొందేలా పనిచేయాలని శ్రీకాకుళం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు.కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో ఆయన క్షేత్రస్థాయిలో సేవలను మరింత వేగవంతం చేసేలా సచివాలయ సిబ్బం దికి దిశానిర్దేశం చేశారు. జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి వివిధ శాఖల పనితీరును పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల కు ప్రభుత్వ పథకాలు, సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందాలని, తద్వారా పరిపాలనలో జిల్లాను ఆదర్శంగా నిలపాలని కోరారు.

## మాజీ మంత్రులు

# రజనీ, అంబటి భేటి

**చిలకలూరిపేట** చిలకలూరిపేటలో మాజీ మంత్రి విడదల రజిని నివాసంలో అంబటి రాంబాబుతో కీలక భేటీ జరిగింది. ఈ సమావేశంలో పార్టీ కార్యకర్తలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా పోరాడాలని, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజల్లోకి బలంగా వెళ్లాలని, క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని వ్యూహాలు రచించారు. ఈ భేటీ పల్నాడు రాజకీయాల్లో కొత్త తిరుగుబాటుకు సూచిక అని నేతలు తెలిపారు. ఈ సంఘటన 2026 ఏప్రిల్ 3న జరిగింది.కూటమి ప్రభుత్వం అమరావతికి 2 లక్షల కోట్లు వృథా ఖర్చు చేస్తుందని మాజీ మంత్రి అబంటి ఆరోపించారు. వైసీపీ మావిగన్ నినాదంపై ఆయన స్పందిస్తూ, మావిగనే ఏపీ అభివృద్ధి మంత్రి అవుతాడని కోపంగా అన్నారు. అమరావతి రాజధాని పూర్తయ్యే అవకాశం అసాధ్యమని, కూటమి విధానాలు రాష్ట్ర ఆర్థిక భవిష్యత్తును దెబ్బతీస్తాయని ఆయన హెచ్చరించారు. ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమయ్యాయి.

## ఒంగోలులో అమరావతి

# సంబరాలు

**ఒంగోలు** ఆంధ్రుల కలల రాజధాని ఎన్నటికీ అమరావతేనని రాష్ట్ర మంత్రులు ఆనం రామ నారాయణరెడ్డి, డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. పార్లమెంటులో అమరావతి బిల్లు ఆమోదం పొందడంతో ఒంగోలు పట్టణంలో సంబరాలు నిర్వహించారు. ఒంగోలులోని రిమ్స్ నుంచి మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు కొవ్వొత్తులతో చర్చి సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించారు. చర్చి సెంటర్ లో బాణా సంచా కాల్చి. మిఠాయిలు పంచి సంబరాలు చేశారు. ఆంధ్రుల రాజధాని అమరావతి నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి విలేకరులతో మాట్లాడుతూ, నేడు రాష్ట్ర చరిత్రలో సువర్ణ అధ్యాయమన్నారు. అమరావతి చట్ట బద్ధతకు కృషి చేసిన ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కి కృతజ్ఞతలు తెలిపారు. అమరావతితో పాటు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేస్తామన్నారు. అమరావతిపై చర్చ సమయంలో వైసీపీ ఎంపీలు సభను బాయికాట్ చేయడం వారి దుర్బుద్ధికి అద్దం పడుతోందన్నారు.

# స్మశాన వాటిక ప్రారంభించిన ఎమ్మెల్యే మైదుకూరు



**మైదుకూరు** మండలం వనిపెంట గ్రామపంచాయతీలో స్మశాన వాటిక ప్రారంభోత్సవము గౌరవనీయులు మైదుకూరు శాసనసభ్యులు శ్రీ పుట్టా సుధాకర్ యాదవ్ గారిచే ప్రారంభించబడినది ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి కే వీ శ్రీధర్ నాయుడు మండల టిడిపి ఇన్చార్జి భీమయ్య, వనిపెంట టిడిపి నాయకులు ఇస్మాయిల్ గారు వివిధ గ్రామ పంచాయతీల నుంచి వచ్చిన ప్రజాప్రతినిధులు, వనిపెంట గ్రామ ప్రజలు ఉపాధి ఏపీఓ రామచంద్రారెడ్డి జేఈ ప్రతాప్ , టెక్నికల్ అసిస్టెంట్ విశ్వనాథరెడ్డి , సురేష్, రమేష్, భైరవ , కొండారెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయడం జరిగినది

# హనుమాన్ శోభయాత్ర లో

## ముస్లిం సహోదరులు మజ్జిగ,నీళ్లు పంపిణీ

- కెపిహెచ్ బి కాలనీ ముస్లిం మైనారిటీ ఆధ్వర్యంలో

రామ్ సేన.. తో ..మేము సైతం 1000, మందికి

- చల్లటి మజ్జిగ మంచినీరు పంపిణీ చేసిన.. సూర్య ఉదయం భాషా...షేక్ సత్తార్



కూకట్ పల్లి(ప్రశ్నన్యూస్) కే పి హెచ్ బి కాలనీ లో హనుమాన్ జయంతి సందర్భంగా రామసేన కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కెపిహెచ్చి కాలనీ రమ్య గ్రౌండ్ లో నిర్వహించిన హనుమాన్ విరాట్ శోభాయాత్ర 2026 లో బాగంగా రామ్ సేన తో మేము సైతం అంటూ కూకట్ పల్లి కెపిహెచ్ బి ముస్లిం మైనారిటీ సభ్యులు శోభాయాత్రలో పాల్గొన్నారు . ఈ శోభయాత్ర కు విచ్చేసిన భక్తులకు సుమారు 1000 మందికి పైగా వాటర్ బాటిల్స్, చల్లటి మజ్జిగా పంపిణీ చేయడం జరిగింది. కుల మతాలకు అతీతంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన సూర్య ఉదయం తెలుగు దినపత్రిక తెలంగాణ ఎడిటర్ ,మరియు నూర్ భాషా దూదేకుల సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షులు భాషా ను, టీడీపీ సీనియర్ నాయకులు షేక్ సత్తార్ ను విలేకరులను డిసిపి రితీరాజ్,కాంగ్రెస్ పార్టీ కూకట్ పల్లి ఇంచార్జి బండి రమేష్ అభినందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ రామ సేన కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన శోభ యాత్రలో పాల్గొన్న భక్తులకు వాటర్ బాటిల్స్ మరియు మజ్జిగ అందించడమే కాక ప్రతి ఒక్క హిందు సోదరుని ఆప్యాయతంగా పలకరించి శుభాకాంక్షలు తెలిపి అలాయ్ బలాయ్ తీసుకున్నారు.భాషా ,షేక్ సత్తార్ మాట్లాడుతూ ఆసియా లోనే అతిపెద్ద కాలనీ గా పేరుపొందిన కె పి హెచ్ బి కాలనీ లో కుల మతాలకు అతీతంగా అన్ని పండుగలను కలిసి జరుపుకుంటామని తెలియజేశారు.కార్యక్రమంలో ప్రముఖ సింగర్ నల్గొండ గద్దర్ నర్సింహా రెడ్డి ,స్థానికులు మహబూబ్ (కచ్చిన్), సీనియర్ విలేకరులు కరీం, నజీర్ ,గంగ రాజు , చంద్ర, రాము,రహమాన్, ప్రవీణ్, షబ్బీర్, శివ ,శ్యాం సుందర్, క్రాంతి కుమార్, బాల కృష్ణ, సునీల్ , మహమ్మద్ హుస్సేన్ , చాంద్ తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు తమ్ముళ్ల మధ్య అంబరాన్నంటిన

# అమరావతి సంబరాలు

### పట్టణ అధ్యక్షుడు విజయ్ కుమార్



శ్రీకాళహస్తి( ప్రశ్న న్యూస్) పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఆదేశాల మేరకు అమరావతికి చట్టబద్ధతతో సంబరాలు మిన్నంటాయి. జై అమరావతి.. జయహో ఆంధ్రప్రదేశ్ అంటూ, పచ్చ కండువాలు గాల్లో తిప్పుతూ రంగులు వెదజల్లుకుంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ చిత్రపటాలకు పట్టణ అధ్యక్షుడు విజయ్ కుమార్ నాయుడు ఆధ్వర్యంలో క్షీరాభిషేకాలు చేస్తూ అమరావతికి చట్టబద్ధతతో సంబరాలు అంబరాలంటుకునే విధంగా తెలుగు మహిళలు మరియు దేశం నాయకులు అత్యంత వేడుకగా నిర్వహించుకున్నారు. తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు విజయ్ కుమార్. మాట్లాడుతూ: ఆంధ్రప్రదేశ్ శాశ్వత రాజధానిగా అమరావతే ఉండాలని అందుకు చట్టబద్ధత కల్పించాలని ప్రవేశపెట్టిన బిల్లుకు పార్లమెంట్ ఆమోదం చేయడంతో ఏపీలో సంబరాలు మిన్నంటుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ని స్వర్ణాంధ్రగా మార్చేందుకు కంకణం కట్టుకున్న కూటమి ప్రభుత్వం సాధించిన విజయంతో అన్నీ వర్గాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ విజయం వెనుక వేలాది మంది రైతుల సుదీర్ఘ పోరాటం, అసమాన త్యాగాలు ఉన్నాయని ఆయన గుర్తు చేశారు. దేశంలో ఏ రాజధానికి లేని విధంగా పార్లమెంట్లో అన్ని పార్టీల ఆమోదంతో అమరావతికి గుర్తింపు రావడం విశేషమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ క్లస్టర్ ఇంచార్జిలు కంట రమేష్, పేట బాలాజీ రెడ్డి, టిడిపి నాయకులు కాసరం రమేష్, గాదిపాకుల గోపి, మిర్జావలి, షఫీ, సుమతి రేణుకమ్మ, తెలుగుదేశం పార్టీ అభిమానులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అమీన్పూర్‌లో ఎస్టీపీ ఏర్పాటు ప్రతిపాదనపై స్థానికుల ఆందోళన



అమీన్పూర్ (ప్రశ్న న్యూస్) అమీన్పూర్ పరిధిలోని సర్వే నంబర్ 993లో ప్రతిపాదితంగా ఏర్పాటు చేయబడుతున్న 100 ఎంఎల్డి సామర్థ్యమున్న ఎస్టీపీ (సెవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్) నిర్మాణంపై స్థానిక నివాసులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మోదీ విల్లాస్, గోల్డెన్ ప్లామ్స్ కాలనీలకు ఆనుకొని ఈ ప్లాంట్‌ను నిర్మించేందుకు చర్యలు జరుగుతున్నట్లు సమాచారం అందుతున్న నేపథ్యంలో కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.స్థానికుల తరఫున న్యాయవాది, సామాజికవేత్త అడ్వకేట్ రవికృష్ణ ప్రెస్ నోట్ విడుదల చేస్తూ, ఈ ఎస్టీపీ ప్లాంట్ ఏర్పాటు వల్ల కేవలం రెండు కాలనీలకే కాకుండా సమీపంలోని లింగమయ్య కాలనీ, సాయి భగవాన్ కాలనీతో పాటు పుణ్యక్షేత్రమైన భ్రమరాంబిక మల్లికార్జున దేవస్థానం పరిసర ప్రాంతాలపై కూడా ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని హెచ్చరించారు. ముఖ్యంగా దుర్గంధ సమస్య తీవ్రంగా పెరిగే ప్రమాదం ఉందని ఆయన పేర్కొన్నారు.ఈ రెండు కాలనీలలో కలిపి సుమారు 150కు పైగా కుటుంబాలు నివసిస్తున్నాయి. ఎస్టీపీ ప్లాంట్ వల్ల దుర్వాసనలు, ఆరోగ్య సమస్యలు, పర్యావరణ కాలుష్యం వంటి ఇబ్బందులు తలెత్తే అవకాశముందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.అదేవిధంగా, ప్లాంట్ నిర్మాణం కోసం ఎంపిక చేసిన ప్రదేశంలో వందల సంఖ్యలో చెట్లను నరుకుతున్నారని, అక్కడ నివసిస్తున్న నెమళ్లు మరియు ఇతర జీవరాశులకు ముప్పు వాటిల్లుతోందని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. జేసీబీలతో జరుగుతున్న తవ్వకాల కారణంగా ఆ జీవరాశులు కాలనీల్లోకి ప్రవేశించడం ప్రారంభించాయని వారు చెబుతున్నారు.ఇక ఈ ప్రాంతానికి సమీపంలో ఇప్పటికే ఒక డంప్ యార్డ్ ఉండటం, అక్కడ చెత్తను సమయానికి తొలగించకపోవడం వల్ల దోమల పెరుగుదల అధికమై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ పరిస్థితుల్లో మరొక భారీ ఎస్టీపీ ప్లాంట్ ఏర్పాటు చేస్తే సమస్యలు మరింత పెరిగే ప్రమాదం ఉందని వారు అభిప్రాయపడుతున్నారు.ఈ అంశంపై చర్చించేందుకు, తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు మోదీ విల్లాస్, గోల్డెన్ ప్లామ్స్ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులను త్వరలోనే కలవాలని నిర్ణయించారు.తక్షణం సమస్యపై స్పందించి, సరైన పరిష్కారం చూపాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## అణగారిన వర్గాల నాయకుడు

## దొడ్డి కొమరయ్య: రేపు నరసింహ కురుమ

### దొడ్డి కొమరయ్య కు ఘన నివాళి



ఉప్పల్ (ప్రశ్న న్యూస్) అణగారిన వర్గాల నాయకుడు, అమరజీవి దొడ్డి కొమరయ్య జయంతిని పురస్కరించుకొని శుక్రవారం రామంతపూర్ మినీ ట్యాంక్ బండ్ పై ఆయన సేవలను కొన్ని ఆడుతూ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రేపు నరసింహ కురుమ మాట్లాడుతూ నిజాం నిరంకుశ రాచరిక వ్యవస్థకు వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో మొట్టమొదటిగా అమరుడైన గొప్ప నాయకుడు దొడ్డి కొమురయ్య అని అన్నారు. అయినా చూపిన బాటలో ప్రతి ఒక్కరు నడవాలని, సంఘ అభివృద్ధికై ప్రతి ఒక్కరం పాటుపడాలని మహనీయులు చూపిన బాటలో మనమందరం పయనించాలని ఈ సందర్భంగా అన్నారు. దొడ్డి కొమరయ్యకు నివాళు లు అర్పించిన వారిలో ఉప్పల్ కురుమ సంఘం అసెంబ్లీ అధ్యక్షులు రేవు కృష్ణయ్య కురుమ, కురుమ సంఘం రామంతపూర్ అధ్యక్షులు రావుల జంగయ్య కురుమ, రామంతపూర్ బీరప్ప దేవాలయం చైర్మన్ సాగర్ రవి కురుమ, బాలమ్ రవి కురుమ, రావుల బీరప్ప కురుమ, బడక శ్రీధర్ కురుమ, బడక కృష్ణ కురుమ, కాడే యాదయ్య కురుమ, సాగ శ్రీను కురుమ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సేవ చేశారు కబ్జాలు చేయలేదు

- బోసాని పవన్ కుమార్
- ఉప్పల్ నారపల్లి కారిడార్ కు బండారి రాజిరెడ్డి పేరు పెట్టినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు
- సొంత నిధులతో ఇప్పటివరకు ప్రజా సేవ చేశారా



ఉప్పల్ (ప్రశ్న న్యూస్) ఉప్పల్ నుండి నారపల్లి వరకు నిర్మిస్తున్న ఎలివేటెడ్ కారిడార్ కు బండారి రాజిరెడ్డి పేరు పెట్టడం ఎంతో శుభసూచకమని ఉప్పల్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు బోసాని పవన్ కుమార్ అన్నారు. కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలు గాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బండారి రాజిరెడ్డి సేవలను గుర్తించి ఉప్పల్ నుంచి నారపల్లి వరకు నిర్మిస్తున్న కారిడార్ కు బండారి రాజిరెడ్డి పేరు ను అసెంబ్లీలో ఆమోదించినందుకు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామని అన్నారు. ప్రజా సమస్యలపై స్పందించి ఎక్కడికక్కడ సమస్యలపై అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న నాయకుడు బండారి లక్ష్మారెడ్డి అని అలాంటి వారిపై లేనిపోని మాటలు మాట్లాడితే చూస్తూ ఎవరు ఊరుకోరని ప్రజలకు సేవ చేయాలన్న బాధ్యత ఉండాలని అలీ కేఫ్ నుండి నాగోల్ మెట్రో స్టేషన్ వరకు 100 ఫీట్ల రోడ్డును వేయించిన ఘనత బండారి రాజిరెడ్డి కే దక్కుతుందని ఉప్పల్ నియోజకవర్గం ఏర్పడిన తర్వాత కారిడార్ కు ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి పేరు పెట్టడం ఆయన చేసిన సేవలకు నిదర్శనమని సేవా కార్యక్రమాలు చేసిన ఘనత బండారి రాజిరెడ్డి కే దక్కుతుందని ఈ సందర్భంగా బోసాని పవన్ కుమార్ అన్నారు.

## గవర్నర్‌కు ఈగిల్ ఫోర్స్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్

### -డ్రగ్స్ వ్యతిరేక చర్యలపై గవర్నర్‌కు అధికారుల వివరణ



హైదరాబాద్(ప్రశ్న న్యూస్) తెలంగాణ ఎలైట్ యాక్షన్ గ్రూప్ ఫర్ డ్రగ్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఈగల్ ఫోర్స్) డైరెక్టర్ సందీప్ శాండిల్య, ఇంటెలిజెన్స్ అదనపు డీజీపీ విజయ్ కుమార్ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను లోక్ భవన్‌లో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఈగిల్ ఫోర్స్ కార్యకలాపాలు, డ్రగ్స్ వ్యాప్తిని అరికట్టేందుకు చేపడుతున్న చర్యలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.ముఖ్యంగా యువతలో పెరుగుతున్న మాదకద్రవ్యాల వినియోగాన్ని నియంత్రించేందుకు అమలు చేస్తున్న వ్యూహాలను వివరించారు.డ్రగ్స్ నియంత్రణలో భాగంగా అవగాహన కార్యక్రమాలు, అమలు చర్యలు, విభాగాల మధ్య సమన్వయంపై వివరించారు. కార్యక్రమంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిశోర్ కూడా పాల్గొన్నారు.

# నల్గొండ జిల్లా నకిరేకల్ లో పిచ్చికుక్కల స్వైర విహారం



నకిరేకల్ (ప్రశ్న న్యూస్) నాలుగు సంవత్సరాల అబ్బాయి శరత్చంద్ర పై వీధిలో ఆడుకుంటుండగా కుక్క దా కుక్క దాడి చేసింది. దానితో శరత్ చంద్ర ముఖంపై భారీగా గాయాలు అయ్యాయని అపస్మానిక స్థితిలో పడిపోయారని స్థానికులు తెలిపారు. వెంటనే హుటాహుటిన ప్రైవేట్ హాస్పిటల్ కి నానమ్మ, తాత తరలించడంతో తీవ్ర గాయాలకు గురైన చిన్నారి శరత్ చంద్రకు ప్రధమ చికిత్స చేసి హైదరాబాద్ నీలోఫర్ ఆస్పత్రికి తరలించారు. కుక్కకు పిచ్చి లేచి అందరినీ కరుస్తుందని ఎవరూ పట్టించుకోవట్లేదు అని ఆవేదన చెందిన చిన్నారి శరత్చంద్ర తల్లిదండ్రులు, అధికారులకు ఎన్నిసార్లు చెప్పిన కుక్కల సమస్య తీర్చడం లేదని ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న కుక్కలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## క్రీస్తు సిలువ మరణాన్ని స్మరించుకుంటూ

# గుడ్ ఫ్రైడే వేడుకలు



**జూలూరుపాడు:** ఈరోజు గుడ్ ఫ్రైడే అనగా మంచి శుక్రవారం గా క్రైస్తవులు పలుకుతారు. ఏసుక్రీస్తు శిలువ మరణాన్ని స్మరించుకుంటూ భక్తి శ్రద్ధతో చర్చిలలో సంఘంపరంగా అందరూ ప్రార్థనలు నిర్వహించి సిలువలో ఏసుప్రభు పలికిన ఏడు మాటలు గురించి వాక్యమును వివరిస్తారు. అలాగే సిలువ మార్గమును రోమన్ సైనికులు సిలువపై ఉన్న యేసు ప్రభువును ఏ రకంగా చిత్రహింసలు పెట్టారో , ఎవరు దూషించిన, ఉమ్మివేసిన,అవమానించిన, వాటన్నిటిని లోక పాప పరిహారము కొరకు భరించి సిలువ భారాన్ని భరించి, లోక పాప విముక్తి చేయడం కొరకు బలి అయ్యారని, ఈ రకంగా సిలువ లో ఆయనను హింసించిన వారిని సైతం క్షమించి వారి కొరకు యేసు ప్రభువు ప్రార్థన చేయడం జరిగింది .అని ఈరోజు మండల పరిధిలో ఉన్న ఇమ్మానుయేలు ప్రార్థన మందిరం లో పాస్టర్ మాలోత్ కబీర్ దాస్ సంఘానికి తెలియజేశారు. అలాగే మండల కేంద్రంలో ఉన్న చర్చిలలో ఉదయం పది గంటల నుండి మధ్యాహ్నం మూడున్నర గంటల వరకు గుడ్ ఫ్రైడే ప్రార్థనలు జరిగాయని తెలియజేశారు. అలాగే మండల వాసులకు సంఘాలకు గుడ్ ఫ్రైడే అనగా మంచి శుక్రవారం శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు విక్టర్ పాల్,రాంబాబు, విజయ్ కుమార్,పవన్ కళ్యాణ్, కిషన్,ఆనందం, జకరియా మరియు మహిళలు, చిన్నారులు, తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారికి అరుదైన శస్త్ర చికిత్స చేసిన

# సిటీ న్యూరో వైద్యులు




అరుదైన మెదడు రక్తనాళ వ్యాధితో బాధపడుతున్న ఏడాదిన్నర వయసున్న చిన్నారికి బంజారాహిల్స్ లోని సిటీ న్యూరో ఆసుపత్రి వైద్యులు విజయవంతంగా శస్త్ర చికిత్సను పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో న్యూరో సర్జరీ విభాగం డాక్టర్ రవి వర్మ, పద్మశ్రీ వివరాలు వెల్లడించారు. నల్గొండ జిల్లాకు చెందిన రవి అఖిల దంపతుల కుమారుడు రక్షిత్ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. చిన్నారికి న్యూరో సమస్య ఉన్నట్లుగా గుర్తించిన వైద్యులు న్యూరో సర్జన్ ను కలవాల్సిందిగా సూచించడంతో వారు బంజారాహిల్స్ లోని సిటీ న్యూరో వైద్యులను సంప్రదించారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు చిన్నారి బాబుకు మెదడులో రక్తనాళ వ్యాధి రైట్ పోస్టిరీయర్ సెరిబ్రల్ ఆర్టరీ లో లార్జ్ ఫ్యూసిఫార్మ్ అన్యూరిజం వ్యాధితో బాధ పడుతున్నట్లుగా గుర్తించారు. ఈ వ్యాధి వల్ల చిన్నారికి ప్రాణాపాయస్థితి ఉంటుందని ప్రతి పది లక్షల మంది చిన్నారుల్లో ఒకటి లేదా రెండు కేసులు మాత్రమే ఇలా ఉంటాయని డాక్టర్ రవి వర్మ తెలిపారు. చిన్నారికి మెదడులో ఉబ్బిన రక్తనాళానికి అత్యంత జాగ్రత్తగా సర్జరీ చేసి విజయవంతం అయినట్లు వారు తెలిపారు. చిన్నారుల్లో ఇలాంటి అన్యూరిజమ్‌లు అత్యంత అరుదుగా ఉంటాయని ఈ పరిస్థితి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని సమన్వయంతో అధునాతన చికిత్సను నిర్వహించినట్లు తెలిపారు. అత్యాధునిక న్యూరో ఇంటర్వెన్షన్ విధానం అయిన కాయిల్ ఎంబోలైజేషన్ తో పాటు పేరెంట్ ఆర్టరీ ఓక్లూజన్ ను విజయవంతంగా పూర్తి చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ అనస్థీషియా వైద్యులు కృష్ణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పలు చోట్ల పోలీసుల తనిఖీలు

**అనంతపురం** అనంతపురం ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్లలో డాగ్ స్క్వాడ్ తో త్రీ టౌన్ పోలీసులు తనిఖీలు జరిపారు. గంజాయి, నాన్ ట్రాన్స్ పోర్ట్ పదార్థాలు పై తనిఖీలు జరిపారు. అనుమానంగా తిరుగుతున్న వారిని విచారించారు. త్రీ టౌన్ సిఐ రాజేంద్రనాథ్ యాదవ్ ఆధ్వర్యంలో తనిఖీలు జరిగాయి.

## సర్వాయి పల్లెలో అభయ ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే



**కడప** మైదుకూరు మున్సిపాలిటీ పదవ వార్డు సర్వాయిపల్లి గ్రామంలో శ్రీ అభయాంజనేయ స్వామి నూతన దేవాలయ నిర్మాణానికి ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ శుక్రవారం శంకుస్థాపన చేశారు.. ఈ సందర్భంగా గ్రామ ప్రజలతోపాటు స్థానిక కౌన్సిలర్ సుబ్బారెడ్డి ఇతర నాయకులు తదితరులు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ కు ఘనంగా స్వాగతం పలికి గ్రామంలోకి ఆహ్వానించారు.ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ కు వేద పండితులు ఆశీర్వచనము లు అందజేశారు .అనంతరం అభయాంజనేయ స్వామి దేవాలయానికి పునాదిరాయివేసి ఆలయ నిర్మాణ పనులు ఎమ్మెల్యే ప్రారంభించారు.. ఈ సందర్భంగాఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ను శాలువా, పూలమాల తలపాగా తో గ్రామ ప్రజలతోపాటు టిడిపి నాయకులు సుబ్బారెడ్డి తదితరులు ఘనంగా సత్కారం చేశారు.

## ధర్పల్లిలో దొడ్డి కొమరయ్య 99వ జయంతి ఉత్సవాలు



ధర్పల్లి (ప్రశ్న న్యూస్)దొడ్డి కొమరయ్య వర్ధంతి సందర్భంగా, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. ఈ సందర్భంగా, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు దొడ్డి కొమరయ్య ఫోటోకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండల కేంద్రంలో దొడ్డి కొమరయ్య తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమరుడు. 1946 జూలై 4న నిజాం రాజ్యంలో దేశముఖ్‌లు, జమీందారుల అరాచకాలకు వ్యతిరేకంగా ఆంధ్రమహాసభ ఆధ్వర్యంలో జరిగిన నిరసన ర్యాలీలో పాల్గొని, తన ప్రాణాలను అర్పించాడు. ఈ ఉద్యమం తెలంగాణ ప్రజలలో స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని రగిల్చిందని ముఖ్యఅతిథిగా పాల్గొన్న తెలంగాణ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ రాజేశ్వర్ అన్నారు. దొడ్డి కొమరయ్య జీవితం, పోరాటం, త్యాగం నేటి తరానికి మార్గదర్శిగా నిలుస్తోంది. ఆయన పోరాట పటిమను నేటి యువతరం ఆదర్శంగా తీసుకోవాలి అని ధర్పల్లి మండల బిజెపి అధ్యక్షుడు జిర్ర మైపాల్ పాల్ యాదవ్ అన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా తెలంగాణ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ పాలెం రాజేశ్వర్ పాల్గొన్నారు. ధర్పల్లి బిజెపి మండల అధ్యక్షుడు మహిపాల్ యాదవ్ ఆధ్వర్యంలో జయంతి ఉత్సవాలు ఘనంగా జరిపారు. ఈ కార్యక్రమంలో పాలెం గణేష్, జిర్ర రాజేందర్, జిర్ర రాజ్ కుమార్, మాసూరి మహేష్, జీర్రా రంజిత్, గంగాధర్, మల్లయ్య, రమేష్, సాయిలు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ క్రమశిక్షణే ఎదుగుదలకు కారణం

**- భాజపా పట్టణాధ్యక్షులు : రాపెల్లి శ్రీధర్**

**- కార్యకర్తలే పార్టీ బలం - ప్రతాప రామకృష్ణ**

**- పట్టణ భాజపా ఆధ్వర్యంలో పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రశిక్షణ తరగతులు ప్రారంభం**



వేములవాడ (ప్రశ్న న్యూస్) వేములవాడ పట్టణ బీజేపీ ఆధ్వర్యంలో పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రశిక్షణ తరగతులు శుక్రవారం నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు రాపెల్లి శ్రీధర్ మాట్లాడుతూ బీజేపీ ప్రపంచంలోనే అతిపెద్ద, క్రమశిక్షణ కలిగిన పార్టీగా నిలిచిందన్నారు. ఈ శిక్షణ తరగతులు రెండు రోజుల పాటు కొనసాగనున్నాయని తెలిపారు.ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ జనసంఘ్‌గా రెండు సీట్లతో ప్రారంభమైన పార్టీ నేడు దేశంలో అధికారంలోకి రావడం క్రమశిక్షణకు నిదర్శనమని పేర్కొన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో అధికారం సాధించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్య అతిథి మోహన్ రెడ్డి పార్టీ ఆవిర్భావం నుంచి సేవలందించిన నాయకుల పాత్రను గుర్తు చేస్తూ, పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జీవిత చరిత్రను వివరించి వారి సేవలను కొనియాడారు.
ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికొండ శ్రీనివాస్, లింగంపల్లి శంకర్, కౌన్సిలర్లు చిన్న ముత్యం, వంగల శ్రీనివాస్, మైలారం శ్రీనివాస్, నాయకులు రేగుల మల్లికార్జున్, కోలా కృష్ణ స్వామి, రేగుల శ్రీకాంత్, మామిళ్ల లక్ష్మీరాజ్యం, పిన్నింటి హనుమాన్లు, పట్టణ ప్రధాన కార్యదర్శి వివేక్ రెడ్డి, ఉపాధ్యక్షులు మెరుగు లక్ష్మణ్, అన్నం నరసయ్య, కొన్నాళ్ల రఘుపతి, గుడిసె మనోజ్, నామాల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎలుక శ్రీశైలం యాదవ్ కు సిద్దిపేట జిల్లా బాధ్యతలు



బెజ్జంకి (ప్రశ్న న్యూస్ ) తెలంగాణ రాష్ట్ర వార్డు సభ్యుల సంక్షేమ సంఘం సిద్దిపేట జిల్లా అధ్యక్షులు గా ఎలుక శ్రీశైలం యాదవ్ ని నియమిస్తూ బెజ్జంకి మండల కేంద్రం లో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర వార్డు సభ్యుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు, న్యాయవాది అతికం రాజశేఖర్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేసి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ వార్డు సభ్యుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు అతికం రాజశేఖర్ గౌడ్ మాట్లాడుతూ వార్డు సభ్యుల సంక్షేమమే లక్ష్యంగా నిరంతరం పనిచేయాలని తెలిపారు. తన నియామకానికి కృషిచేసిన రాష్ట్ర అధ్యక్షులు న్యాయవాది అతికం రాజశేఖర్ గౌడ్ లకు ఎలుక శ్రీశైలం యాదవ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు వార్డు సభ్యులు పాల్గొన్నారు .

## యేసుక్రీస్తు త్యాగం మానవత్వానికి మార్గదర్శకం

**- వేములవాడ మాజీ సర్పంచ్, బీసీ సంఘం నేత : పొలాస నరేందర్**



వేములవాడ (ప్రశ్న న్యూస్) గుడ్ ఫ్రైడే సందర్భంగా ప్రపంచానికి ప్రేమ,క్షమ,దయ సందేశాన్ని అందించిన యేసుక్రీస్తు త్యాగం ప్రతి మనిషికి ఆదర్శమని వేములవాడ మాజీ సర్పంచ్, బీసీ సంఘం నాయకులు పొలాస నరేందర్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం అయన విడుదల చేసిన సందేశంలో,సిలువపై ప్రభువు చేసిన త్యాగం మానవాళి పాప విమోచన కోసం జరిగిన గొప్ప త్యాగమని పేర్కొన్నారు. ఆయన బోధనలు నేటికీ సమాజానికి దిశానిర్దేశం చేస్తాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ ప్రేమ, సహనం, సౌహార్దం వంటి విలువలను ఆచరిస్తే సమాజంలో శాంతి నెలకొంటుందని అభిప్రాయపడ్డారు. గుడ్ ఫ్రైడే పర్వదినం సందర్భంగా క్రైస్తవ సోదర సోదరీమణులకు శుభాకాంక్షలు తెలుపుతూ, అందరికీ శాంతి, సౌభాగ్యం కలగాలని ఆకాంక్షించారు.

# టీఆర్ఎస్ పేరుతో కవిత పార్టీ పెడితే ఏమవుతుంది.?

## - బీఆర్ఎస్ పార్టీ పునాదులు కదిలిపోతాయా.?

**(జె. సతీష్ - ప్రశ్న న్యూస్)**



తెలంగాణ రాజకీయాల్లో మరో భారీ కుదుపునకు రంగం సిద్ధమవుతోంది. కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటుకు ముహూర్తం ఖరారు చేసుకున్న కవిత తన పార్టీకి టీఆర్ఎస్ అనే ఎమోషనల్ సెంటిమెంట్ కలిసిన పేరును పార్టీకి ఖరారు చేయబోతున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. అదే జరిగితే బీఆర్ఎస్ పార్టీకి పెను సమస్య కావొచ్చు.

**- పేరు మార్పు - చారిత్రక తప్పిదం**

తెలంగాణ రాష్ట్ర సమితిని భారత రాష్ట్ర సమితిగా మార్చడం అనేది కేసీఆర్ చేసిన అతిపెద్ద రాజకీయ తప్పిదమని ఇప్పుడు సొంత పార్టీ నేతలే బహిరంగంగా అంగీకరిస్తున్నారు. జాతీయ రాజకీయాల మోజులో తెలంగాణ అనే అస్తిత్వాన్ని వదులుకోవడం వల్ల ప్రజలతో ఉన్న పేగుబంధం తెగిపోయిందని క్షేత్రస్థాయి ఫీడ్‌బ్యాక్ చెబుతోంది. ఎన్నికల ఓటమి తర్వాత మళ్లీ పాత పేరుకు మారదామని కేటీఆర్ సహా ఇతర నేతలు భావించినా, సాంకేతిక కారణాల వల్ల అది సాధ్యం కాదని కేసీఆర్ తేల్చేశారు. సరిగ్గా ఈ ఖాళీనే కవిత తన రాజకీయ ఎదుగుదలకు అనువుగా మలచుకుంటున్నారు.

**- వ్యూహాత్మక అడుగు - ఎమోషనల్ డ్యామేజ్**

ప్రస్తుతం ఎలక్షన్ కమిషన్ వద్ద టీఆర్ఎస్ పేరు ఫ్రీగా ఉందని, దానిని ఎవరైనా వాడుకోవచ్చని కవిత తాజాగా చేసిన వ్యాఖ్యలు బీఆర్ఎస్ నాయకత్వానికి పెద్ద షాక్. ఒకవేళ కవిత నిజంగానే తన కొత్త పార్టీకి టీఆర్ఎస్ అని పేరు పెడితే, అది బీఆర్ఎస్ పార్టీకి ఊహించని ఎమోషనల్ డ్యామేజ్ కలిగిస్తుంది. రెండు దశాబ్దాల పాటు తెలంగాణ వాదం వినిపించిన ఆ పేరు పట్ల క్యాడర్‌లో ఇప్పటికీ విపరీతమైన ఆదరణ ఉంది. ఇప్పుడు అదే పేరుతో కవిత ముందుకు వస్తే, బీఆర్ఎస్ వైపు ఉన్న అసంతృప్త నేతలు, పాత ఉద్యమకారులు ఆమె వైపు మొగ్గు చూపే అవకాశం పుష్కలంగా ఉంది.

**- సిద్ధాంతాల పోరు - తెలంగాణ వర్సెస్ బిహార్**

కవిత తన చిట్ చాట్‌లో మరో కీలక విమర్శ చేశారు. తమ పార్టీలో బిహార్ సిద్ధాంతకర్తలు ఉండరని, కేవలం ఆచార్య జయశంకర్ గారి తెలంగాణ సిద్ధాంతాలే ఉంటాయని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీలో చేరిన పొలిటికల్ స్ట్రాటజిస్టుల పెత్తనాన్ని ఎండగడుతూ, తాను మళ్లీ స్వచ్ఛమైన తెలంగాణ ఉద్యమ కాలపు పార్టీని తీసుకొస్తానని ఆమె సంకేతాలిచ్చారు. ఇది నేరుగా కేటీఆర్ అనుసరిస్తున్న కార్పొరేట్ తరహా రాజకీయాలపై ఆమె చేసిన దాడిగా విశ్లేషకులు భావిస్తున్నారు. బీఆర్ఎస్ ప్రస్తుతం నిద్రావస్థలో ఉందని, తెలంగాణ ప్రయోజనాల కోసం పోరాడే శక్తి లేదని కవిత విమర్శిస్తున్నారు. ఒకవేళ ఏప్రిల్ 25న ఆమె ప్రకటించబోయే కొత్త పార్టీ పేరులో తెలంగాణ సెంటిమెంట్ బలంగా ఉంటే, క్షేత్రస్థాయిలో ఉన్న గులాబీ శ్రేణులు అయోమయంలో పడటం ఖాయం. బీఆర్ఎస్ కంటే టీఆర్ఎస్ అనే పేరుకే తెలంగాణ సమాజంలో గుర్తింపు ఎక్కువ. ఆ పేరును కవిత గనుక సొంతం చేసుకుంటే, కేసీఆర్ స్థాపించిన సుదీర్ఘ రాజకీయ వారసత్వాన్ని ఆమె తన వైపు తిప్పుకున్నట్లవుతుంది.

**- పాత పేరు - కొత్త ఎజెండా**

తెలంగాణ అస్తిత్వమే పునాదిగా ఎదిగిన కేసీఆర్ కుటుంబంలోనే ఇప్పుడు పేరు కోసం పోరు మొదలైంది. తండ్రి వదులుకున్న అస్త్రమే ఇప్పుడు తనయకు ఆయుధంగా మారింది. ఈ పాత పేరు - కొత్త ఎజెండా వ్యూహం తెలంగాణ రాజకీయ చిత్రపటాన్ని ఎలా మారుస్తుందో చూడాలి. ఒకవేళ కవిత టీఆర్ఎస్ ను మళ్లీ బతికిస్తే, అది బీఆర్ఎస్ ఉనికికే ప్రమాదకరంగా మారే అవకాశం ఉంటుందా లేదా అన్నది కవిత పనితీరుపైనే ఆధారపడి ఉంటుందని అనుకోవచ్చు.

# ఉప్పల్ సర్కిల్లో అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు

**- ఉప్పల్ ఉప కమిషనర్, టౌన్ ప్లానింగ్ ఎసిపి, సెక్షన్ ఆఫీసర్లకు అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు చేసిన పట్టించుకోరా?**

**- రాజకీయ నాయకులకు టౌన్ ప్లానింగ్ అధికారులు వత్తాసు పలుకుతున్నారా**

**- ప్రభుత్వ జీతాలు తీసుకుంటూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న అధికారుల పై చర్యలు తీసుకోరా**

**- అధికార పార్టీ నాయకులే అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారా**

**- మున్సిపల్ శాఖ మంత్రి టౌన్ ప్లానింగ్ అధికారులపై, రాజకీయ నాయకులపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో**



ఉప్పల్ (ప్రశ్న న్యూస్) ఉప్పల్ సర్కిల్లో యదేచ్చగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్న టౌన్ ప్లానింగ్ అధికారులు ఉప్పల్ డిప్యూటీ కమిషనర్ అక్రమ నిర్మాణాల పై ఎలాంటి చర్యలు తీసుకోకుండా నోటీసులతో కాలయాపన చేస్తున్నారని ప్రభుత్వ అనుమతులకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని స్థానికులు ఫిర్యాదులు చేసిన, దినపత్రికలో ప్రచురించిన పట్టించుకోకుండా రాజకీయ నాయకులకు వత్తాసు పలుకుతూ అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారని ఆరోపణ వినిపిస్తున్నాయి. ఉప్పల్ డివిజన్ వెంకటేశ్వర కాలనీలో సెట్ బ్యాక్ లేకుండా ప్రభుత్వ అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నారని ఫిర్యాదులు చేసిన టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడంలేదని, టౌన్ ప్లానింగ్ అధికారులకు అక్రమ నిర్మాలపై ఫిర్యాదు చేస్తే గతంలో ఉన్న అధికారులు ఉన్నప్పుడే ఈ నిర్మాణాలు జరుగుతున్నాయని ఇప్పుడు మేము వాటిని ఏమీ చేయలేమని సమాధానం చెబుతున్నారని ప్రభుత్వ అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే అధికారులు మారితే వచ్చిన అధికారులు వాటిపై చర్యలు తీసుకోరా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మున్సిపల్ శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న సామాజిక మాధ్యమాలలో అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు చేసిన అధికారులు స్పందించడం లేదని, రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి పదవి బాధ్యతలు చేపట్టాక అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకుంటామని పలుమార్లు అధికారకు తెలిపిన అధికారులు మాత్రం అధికార పార్టీ నాయకులకు భయపడి అక్రమ నిర్మాణాలపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని అక్రమ నిర్మాణాలు చేపట్టే ఇంటి యజమానులు స్థానిక కార్పొరేటర్లతో అధికార పార్టీ నాయకులతో ఫోన్లు చేయించి బెదిరింపులకు పాల్పడుతున్నారని అలాంటప్పుడు మేము ఏం చేయాలని టౌన్ ప్లానింగ్ అధికారులు తెలుపుతున్నారని స్థానికులు తెలిపారు. ప్రభుత్వ అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే విద్యుత్ మీటర్లు ఇవ్వకుండా ఆక్యుపేషన్ సర్టిఫికెట్ లేకుండా అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టే వారికి విద్యుత్ మీటర్లు ఇవ్వకుండా టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు చేపడితే అక్రమ నిర్మాణాలు జరగాయని రాజకీయ నాయకులకు భయపడి అక్రమ నిర్మాణాలకు వత్తాసు పలుకుతే జరగరాని సంఘటన జరిగితే దానికి బాధ్యత ఎవరు వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. ఉప్పల్ సర్కిల్లో పుట్టగొడుగుల్లా ప్రభుత్వ అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టే వాటి పై కఠిన చర్యలు తీసుకోవాలని టౌన్ ప్లానింగ్ అధికారులు సీజ్ చేసిన బిల్డింగులు నిర్మాణం అవుతున్నాయని ప్రభుత్వ జీతాలు తీసుకొని ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టే టౌన్ ప్లానింగ్ అధికారులపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్ చేస్తున్నారు.



# ప్రజాసేవ చేసాము కబ్జాలు చేయలేదు: బండారి లక్ష్మారెడ్డి

**- నిలువెత్తు సేవకు నిదర్శనం మాజీ శాసనసభ్యులు బండారి రాజిరెడ్డి**

**- ఎలివేటెడ్ కారిడార్ కు బండారి రాజిరెడ్డి పేరు పెట్టడం అంటే ఆయన సేవలను గుర్తించడమే**

ఉప్పల్ (ప్రశ్న న్యూస్) ఉప్పల్ నారపల్లి కారిడార్ పేరు రాజకీయాలకు బలి కాకూడదు ఉప్పల్ నుంచి నారపల్లి వరకు నిర్మిస్తున్న ఎలివేటెడ్ కారిడార్‌కు దివంగత నేత బండారి రాజిరెడ్డి పేరు పెట్టడంపై మాజీ ఎమ్మెల్యే మీద విమర్శలు గుప్పించారు.కానీ ఇది కేవలం పేరు వివాదం కాదు ప్రజల భావోద్వేగాలపై జరుగుతున్న రాజకీయ ఆట అని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మండిపడ్డారు.ఇది ఒక పేరు కాదు నిలువెత్తు ఒక సేవా చరిత్ర కు నిలువెత్తు స్మారకం అని ఆయన అన్నారు.ఈ సందర్భంగా కాప్రా లో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి దాదాపు 150 కోట్ల తో రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయడం జరిగింది అని ఆయన అన్నారు. రాజకీయాలకు అతీతంగా నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్ పై నిప్పులు చెరిగారు.ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్‌కు బండారి రాజిరెడ్డి పేరు పెట్టడాన్ని మాజీ ఎమ్మెల్యే వ్యతిరేకించడం పట్ల తీవ్రంగా ఖండించారు.బండారి రాజిరెడ్డి మున్సిపల్ చైర్మన్ గా, ఎమ్మెల్యేగా, టీటీడీ బోర్డు మెంబర్ గా ప్రజల కోసం ఎన్నో అభివృద్ధి పనులు చేశారని పేర్కొన్నారు. ఆ సేవలకు గుర్తింపుగా ప్రజల కోరిక మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్‌కు ఆయన పేరు పెట్టడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. వాజపేయి పేరును జాతీయ రహదారికి పెట్టాలని సూచించారు. బీజేపీ మాజీ ఎమ్మెల్యే అర్థరహితంగా మాట్లాడటం ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నానని బండారి లక్ష్మారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.అభివృద్ధికి రాజకీయ రంగు వేయొద్దు ప్రజల భావోద్వేగాలతో ఆటలాడొద్దు అధికారంలో ఉన్నా లేకపోయిన ప్రజల కోసం నిధులు తీసుకురావడం మా బాధ్యత మా పోరాటం ఆగదు అని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు.





## ఆది సాయికుమార్ 'సైరాబాను' గ్రాండ్ లాంచ్..

# క్లాప్ కొట్టిన కిరణ్ అబ్బవరం!

టాలీవుడ్ యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో ఆది సాయికుమార్ సరికొత్త లవ్ స్టోరీతో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమయ్యారు.

అన్ని హద్దులను చెరిపేసే ఒక అందమైన ప్రేమకథగా రూపొందుతున్న ఈ చిత్రానికి 'సైరాబాను' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేశారు మేకర్స్. ఈ ప్రాజెక్ట్ నేడు అత్యంత వైభవంగా పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. సినీ రంగానికి చెందిన ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరై చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ ముహూర్తపు సన్నివేశానికి యంగ్ హీరో కిరణ్ అబ్బవరం క్లాప్ కొట్టగా, ప్రముఖ దర్శకుడు రామ్ అబ్బరాజు మరియు సీనియర్ నటుడు సాయికుమార్ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. ప్రముఖ రచయిత కోన వెంకట్ మరియు జైన్స్ నాని చిత్ర స్క్రిప్ట్‌ను మేకర్స్‌కు అందజేశారు. ఇక ఈ మొదటి షాట్‌కు దర్శకుడు యోగి దర్శకత్వం వహించారు. హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, కృష్ణకాంత్ పరుచూరి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఫణి క్రిష్ణ సిరికి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో బాంధవి శ్రీధర్ కథానాయికగా నటిస్తోంది. శేఖర్ చంద్ర సంగీతాన్ని అందిస్తుండగా, రామ్ రెడ్డి సినిమాటోగ్రాఫర్‌గా మరియు ఛోటా కె. ప్రసాద్ ఎడిటర్‌గా బాధ్యతలు స్వీకరించారు. బ్రహ్మ కడలి ఆర్ట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఈ ఫీల్ గుడ్ లవ్ స్టోరీ రెగ్యులర్ షూటింగ్ త్వరలోనే ప్రారంభం కానుంది.

## ధనుష్ సెట్‌లో చాలా నిశ్శబ్దంగా

# ఉంటాడు



మలయాళ చిత్ర పరిశ్రమ నుండి వచ్చి, టాలీవుడ్‌లో వరుస విజయాలతో 'గోల్డెన్ లెగ్'గా గుర్తింపు తెచ్చుకున్న అందాల నటి... సంయుక్త మీనన్. బింబిసార, విరూపాక్ష వంటి చిత్రాలతో తెలుగు పరిశ్రమలో ఆమె స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. పవర్ స్టార్ పవన్ చిత్రం 'భీమ్లా నాయక్'తో సంయుక్త రేంజ్ నెక్స్ట్ లెవెల్ కి వెళ్లింది. తమిళనాడులో కూడా సంయుక్తకు భారీ ఫాలోయింగ్ ఉంది. తాజాగా ఒక ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ... ధనుష్ సరసన 'సార్' (తమిళంలో వాతి) చిత్రంలో నటించిన అనుభవాన్ని ఆమె పంచుకుంది. "ధనుష్ తో పనిచేయడం నాకు ఒక గొప్ప పాఠం లాంటిది.

ఆయన సెట్‌లో చాలా నిశ్శబ్దంగా ఉంటారు. కానీ కెమెరా ముందుకు రాగానే అద్భుతమైన శక్తిని ప్రదర్శిస్తారు. ఆయన కథను ఎంచుకున్నారంటే అందులో కచ్చితంగా ఏదో ఒక ప్రత్యేకత ఉంటుంది" అని సంయుక్త ప్రశంసించింది. భవిష్యత్తులో మళ్ళీ ఆయనతో కలిసి నటించాలనే కోరికను ఆమె వ్యక్తం చేసింది. వెంకీ అట్లూరి దర్శకత్వంలో వచ్చిన 'సార్' చిత్రం విద్యా వ్యవస్థలోని లోపాలను ఎత్తిచూపుతూ రూ. 100 కోట్లకు పైగా వసూళ్లను సాధించింది. ఇందులో మీనాక్షి అనే బోటనీ లెక్చరర్ పాత్రలో సంయుక్త ఒదిగిపోయింది. కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా, కథాబలమున్న సినిమాలను ఎంచుకోవడమే తన విజయ రహస్యమని ఆమె స్పష్టం చేసింది.


# 'బైకర్' మూవీ రివ్యూ



'నారీ నారీ నారీ నడుమ మురారి' విజయం తరువాత హీరో శర్వానంద్ నటించిన చిత్రం 'బైకర్'. తొలి భారతీయ మోటో రేసింగ్ చిత్రంగా, బైక్ రేసింగ్ నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రం ప్రచార చిత్రాలతో అందర్నీ ఆకట్టుకోవడంతో పాటు శర్వానంద్ లుక్ కూడా ఈచిత్రంలో వైవిధ్యంగా కనిపించడంతో సినిమాపై ఆసక్తిని పెంచింది. ఈ శుక్రవారం ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ చిత్రం ప్రేక్షకులను అలరించే అంశాలున్నాయా? అసలు బైకర్ కథేమిటి? రివ్యూలో తెలుసుకుందాం. విక్కీ అలియాస్ వికాస్ నారాయణ్, (శర్వానంద్) తండ్రి సునీల్ నారాయణ్ (రాజశేఖర్) దగ్గరే మోటో రేసింగ్ బైకర్‌గా శిక్షణ పొంది అంతర్జాతీయ బైక్ రేసర్‌గా రాణించాలని ప్రయత్నిస్తుంటాడు. సునీల్ నారాయణ్ క్రికెట్‌తో సమానంగా ఇండియాలో మోటో రేసింగ్ స్పోర్ట్స్‌కు గుర్తింపు తేవాలని కలలు కంటాడు. అందుకే కొడుకు విక్కీని గొప్ప బైక్ రేసర్‌గా తీర్చిదిద్దటానికి ట్రైనింగ్ ఇస్తుంటాడు. విక్కీ, తండ్రి డ్రీమ్ నెరవేర్చేందుకు అంతర్జాతీయ రేసింగ్‌లో పాల్గొంటాడు. అయితే ఈ పోటీలో ప్రత్యర్థి అన్వర్ వేసిన పన్నాగంతో విక్కీ మూడో స్థానంలో నిలుస్తాడు. ఈ రేసింగ్ తరువాత విక్కీ కొన్ని కారణాల వల్ల రేసింగ్‌కి, తండ్రికి దూరం కావాల్సి వస్తుంది. విక్కీ జీవితంలోకి వచ్చిన అనన్య వల్ల ఆయన లైఫ్‌లో వచ్చిన మార్పులేమిటి? కొంత విరామం తరువాత మళ్లీ విక్కీ రేసింగ్‌లో ఎందుకు పాల్గొన్నాడు? ఇందుకు కారణాలేమిటి? రేసింగ్‌లో ఇండియా తరపున విక్కీ విజయం సాధించి తండ్రి ఆశయాన్ని నేరవేర్చాడా? లేదా? తండ్రి, కొడుకుల మధ్య అసలు జరిగిందేమిటి? ఇవన్నీ తెలియాలంటే సినిమా చూడాల్సిందే. ఇప్పటి వరకు ఇండియన్ సినిమాలో ఎవరికి పరిచయం లేని బైక్ రేసింగ్ నేపథ్యంలో మోటో రేసింగ్ నేపథ్యంలో తెరకెక్కిన చిత్రమిది. ఈ నేపథ్యానికి ఫ్యామిలీ ఎమోషన్స్‌ను జోడించి దర్శకుడు ఈ కథను అల్లుకున్నాడు. అయితే ఇప్పటి వరకు తెలుగు తెరపై వచ్చిన స్పోర్ట్స్ డ్రామాల కథల తరహాలోనే ఈ కథ కూడా ఉంటుంది. కథ, కథనాల్లో ఎలాంటి కొత్తదనం ఉండదు. కథలో ఎలాంటి కీలక మలుపులు కూడా దర్శకుడు ఈ కథలో జోడించలేదు. ఊహకు అందే కథ, సన్నివేశాలతో సినిమా ఆద్యంతం తెలిసిన కథలానే కొనసాగుతుంది. దీనికి తోడు సినిమాలో ఉన్న ఫ్యామిలీ ఎమోషన్స్‌ను పూర్తిస్థాయిలో పండించడంలో దర్శకుడు తడబడ్డాడు. కథ, ఎమోషన్స్ కంటే కథ నేపథ్యానికి కీలకంగా నిలిచే రేసింగ్ సన్నివేశాలపైనే దర్శకుడు దృష్టి పెట్టాడు. ఈ విషయంలో మాత్రం ఆయన సఫలీకృతుడయ్యాడు. ఎందుకంటే సినిమాకు మోటో రేసింగ్ నేపథ్యం కొత్తదనంతో పాటు సినిమా చూస్తే ఆడియన్స్‌ను థ్రిల్లింగ్‌ను కలిగిస్తుంది. రేసింగ్ సన్నివేశాలను విజువల్‌గా హైస్టాండర్డ్‌లో కనిపించాయి. ఈ సన్నివేశాల్లో ప్రేక్షకులు కూడా లీనమయ్యే విధంగా దర్శకుడు తెరపైకి తీసుకొచ్చాడు. ముఖ్యంగా అత్యంత క్లిష్టమైన రేసింగ్ సన్నివేశాలను ఎంతో ఉన్నత స్థాయిలో చిత్రీకరించారు. ఇక్కడే డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ తన ప్రతిభను చూపారు. ఫస్టాఫ్ కాస్త స్లోగా స్పీడ్ తగ్గినట్లుగా అనిపించినా.. సెకండాఫ్‌ను దర్శకుడు తెరకెక్కించిన విధానం ప్రశంసనీయం. ముఖ్యంగా ఈ సినిమాకు సెకండాఫే కీలకం. ఇక్కడ ఏ మాత్రం దర్శకుడు సన్నివేశాల రూపకల్పనలో నిర్లక్ష్యంగా ఉన్నా సినిమా ఆద్యంతం డాక్యుమెంటరీ ఫీల్‌ను కలిగించేది. అయితే తొలిసగంతో కంపేర్ చేస్తే మలిసగంలో సినిమా స్పీడ్‌ను, కొన్నిబలమైన ఎమోషన్ సన్నివేశాలను జనరంజకంగా తీర్చిదిద్దడం, పతాక సన్నివేశాలను కన్విన్సింగ్‌గా ప్రజెంట్ చేయడంతో ఓవరాల్‌గా ఓ రిఫ్రెషింగ్ స్టోరీతో సినిమా చూశామన్న అనుభూతి ప్రేక్షకులకు కలుగుతుంది. అయితే దర్శకుడు ఒక్కోసారి సినిమా కథకు బ్రేక్ వేసి, బైక్‌ను మాత్రం రేసింగ్ ట్రాక్‌పై తిప్పుతున్నాడా? అనే ఫీల్ కలిగే విధంగా కథ ముందుకు కదలదు. మలేషియా రేస్ ట్రాక్‌పై జరిగే బైక్ రేసింగ్, జర్మనీలో సాగే రేసింగ్ సీన్స్ ఈ లోపాలను అధిగమించేలా చేశాయి. అయితే కథలో ఎమోషన్ సన్నివేశాలపై శ్రద్ధ పెట్టి, వాటిని హార్ట్‌టచ్చింగ్‌గా తెరకెక్కించి ఉంటే ఈ బైకర్ రైడ్ హ్యాపీ జర్నిలా ఉండేది. ఓవరాల్‌గా రేసింగ్ అనే కొత్త నేపథ్యంతో దర్శకుడు నిజాయితీగా చేసిన ఈ ప్రయత్నం అభినందనీయం. ఈ సినిమాలో హీరో శర్వానంద్ లుక్, గెటప్ ఎంతో ఆకర్షణీయంగా ఉంది. ఆయన నటన ఈ చిత్రానికి ప్రధాన బలం. క్యారెక్టర్ తగిన విధంగా స్పోర్ట్స్ పర్సన్‌గా ఆయన బాడీని మార్చుకున్న విధానం సినిమా పట్ల శర్వానంద్‌కు ఉన్న తపనను తెలియజేస్తుంది. యాక్షన్‌తో పాటు ఎమోషనల్ సన్నివేశాల్లో శర్వానంద్ నటన ఆర్గానిక్‌గా అనిపించింది. సునీల్ నారాయణ పాత్రలో రాజశేఖర్ ఆకట్టుకున్నారు. కోచ్ పాత్రలో రాజశేఖర్ కొత్తగా ఉన్నారు. మాళవిక పాత్ర సినిమాలో కీలకంగా ఉంటుంది.

శర్వానంద్, మాళవిక పెయిర్ చూడముచ్చటగా ఉంది. అతుల్ కులకర్ణి, బ్రహ్మాజీ, తులసి తదితరుల క్యారెక్టర్స్ అలరిస్తాయి. టెక్నికల్‌గా కూడా ఈ చిత్రం హై స్టాండర్స్‌లో ఉంది. ముఖ్యంగా యువరాజ్ ఫోటోగ్రఫీతో సినిమా ఎంతో కలర్‌ఫుల్‌గా కనిపించింది. రేసింగ్ సన్నివేశాల్లో ఆయన ప్రతిభ గురించి సినిమా చూసిన అందరూ మాట్లాడుకునే విధంగా ఉంటాయి. గిబ్రాన్ నేపథ్య సంగీతం కథ మూడ్‌ను క్యారీ చేసింది. దర్శకుడు అభిలాష్ రెడ్డి తను అనుకున్న కథను నిజాయితీగా తెరకెక్కించాడు. ఆయన రాసిన సంభాషణలు కూడా అలరిస్తాయి. నిర్మాణ విలువలు బాగున్నాయి.

# కుస్తీ బరిలో పెద్ది



ఇటీవల విడుదల చేసిన 'పెద్ది' గ్లింప్స్‌లో కుస్తీ యోధుడిగా చిత్ర కథానాయకుడు రామ్‌చరణ్ కనిపించిన తీరు అందరిని ఆకట్టుకుంది. సిక్స్‌ప్యాక్ బాడీతో పహిల్వాన్ అవతార్‌లో ఆయన స్క్రీన్‌ప్రజెన్స్ హైలైట్‌గా నిలిచింది. గురువారం హనుమాన్ జయంతిని పురస్కరించుకొని కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో ఆయన భారీ చెక్క గదను పట్టుకొని హనుమంతుడిని స్ఫురించేలా కనిపిస్తున్నారు. కుస్తీ ఆట తాలూకు శక్తియుక్తులు, హనుమంతుడి తాలూకు ఆధ్యాత్మికత మేళవింపుతో ఈ పోస్టర్‌ను తీర్చిదిద్దినట్లు మేకర్స్ తెలిపారు. 'పెద్ది' చిత్రంలో రామ్‌చరణ్ ఆటకూలీ పాత్రలో కనిపించనున్నారు. 1980 దశకంలో సాగే పీరియాడిక్ రూరల్ స్పోర్ట్స్ డ్రామాగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాల్లో ఉన్న ఈ సినిమా ఈ నెల 30న పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకుల ముందుకురానుంది. జాన్వీకపూర్, శివరాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందుశర్మ, బోమన్ ఇరానీ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: ఏ.ఆర్.రెహమాన్, నిర్మాణ సంస్థ: వృద్ధి సినిమాస్, సమర్పణ: మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్, నిర్మాత: వెంకట సతీష్ కిలారు, రచన-దర్శకత్వం: బుచ్చిబాబు సానా.


# మగవాళ్లకు ఒక రూల్..

## ఆడవాళ్లకు ఒక రూలా?": సమాజంపై మంచు లక్ష్మి ఫైర్

ప్రముఖ సినీ నటుడు మంచు మోహన్ బాబు తనయగా కాకుండా, నటిగా, నిర్మాతగా తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేసుకున్న మంచు లక్ష్మి ప్రస్తుతం వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. ఇటీవల 'ఆదిపర్వం', 'దక్ష' చిత్రాలతో అలరించిన ఆమె, మార్చి చివరి వారంలో 'లేచింది మహిళా లోకం' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె, మన సమాజం మహిళలను చూసే దృక్పథంపై నిప్పులు చెరిగారు. సమాజం మహిళలను జడ్జ్ చేసే విధానాన్ని లక్ష్మి తప్పుబట్టారు. "మగవాళ్లు ఏదైనా బోల్డ్ నిర్ణయాలు తీసుకుంటే అది గొప్ప అని ప్రశంసిస్తారు. అదే ఆడవాళ్లు చేస్తే మాత్రం రకరకాలుగా మాట్లాడుకుంటారు. 'మేము చేస్తే సంసారం.. మీరు చేస్తే ఆ వ్యవహారం' అనే విధంగా ఉంటుంది. ఆ సామెతను నా నోటితో పూర్తిగా చెప్పను కానీ, మీకు అర్థమైందని అనుకుంటున్నాను" అని ఆమె చమత్కరిస్తూనే గట్టి కౌంటర్ ఇచ్చారు. ఆడవాళ్లు ఇలాగే ఉండాలి, ఇలాగే ప్రవర్తించాలి అని రూల్స్ రాసింది ఎవరని ఆమె ప్రశ్నించారు. తన వ్యక్తిగత జీవితానికి సంబంధించి ఒక ఆసక్తికర విషయాన్ని లక్ష్మి పంచుకున్నారు. "నా పెళ్లి సమయంలోనే నా భర్తకు ఒక మాట చెప్పాను. నువ్వు ఏ పని చేస్తావో.. అదే పని నేను కూడా చేయగలను అని గుర్తుంచుకోమన్నాను" అని తెలిపారు. తన మాటల ప్రభావమో ఏమో కానీ, తన భర్త ఏదైనా చేయడానికి జంకుతారని, తను చేస్తే లక్ష్మి కూడా చేస్తుందనే భయం ఆయన మనసులో ఉంటుందని ఆమె సరదాగా పేర్కొన్నారు.



# కాలాతీతం రామచరితం



భారతీయ సినీ చరిత్రలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్న చిత్రం 'రామాయణ'. రణ్‌బీర్‌కపూర్ రాముడిగా, సాయిపల్లవి సీత పాత్రలో నటిస్తున్న ఈ చిత్రానికి నితేష్ తివారీ దర్శకత్వం వహిస్తున్నారు. రెండు భాగాలుగా తెరకెక్కుతున్నది. మొదటి భాగం ఈ ఏడాది దీపావళికి విడుదలకానుంది. గురువారం హనుమాన్ జయంతిని పురస్కరించుకొని టీజర్‌ను విడుదల చేశారు. 'లోకం అధర్మంతో అల్లకల్లోలంగా మారినప్పుడు, అశాంతి ప్రబలినప్పుడు వాటన్నింటికి సమాధానంగా ఆయనే వస్తారు' అనే ఉపోద్ఘాతంతో మొదలైన టీజర్ ఆద్యంతం అబ్బురపరిచే విజువల్స్‌తో ఆకట్టుకుంది. 'రామాయణం కాలాతీత గాథ. భారతీయ సజీవ సాంస్కృతిక శక్తికి నిదర్శనం. రాముడు ధర్మానికి, కరుణకు, నిస్వార్థతకు ప్రతీక' అని దర్శకుడు అన్నారు. రాముడి పాత్రలో రణబీర్‌కపూర్ ఆకట్టుకున్నారు. అయోధ్య నుంచి అరణ్యం వైపునకు సాగిన శ్రీరాముడి ప్రయాణాన్ని టీజర్‌లో చూపించారు. దాదాపు 4000 కోట్ల భారీ వ్యయంతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. 'రామాయణ' చిత్రంలో యష్ (రావణుడు), సన్నీ డియోల్ (హనుమంతుడు), రవి దూబే (లక్ష్మణుడు) పాత్రల్ని పోషిస్తున్నారు. నమిత్ మల్హోత్రా ప్రైమ్ ఫోకస్, యష్ మాస్టర్‌మైండ్స్ క్రియేషన్స్ నిర్మాణ భాగస్వామ్యంలో రెండు భాగాలుగా ఐమ్యాక్స్ ఫార్మాట్‌లో ఈ సినిమా విడుదలకానుంది.

# ఫ్రెండ్స్ ఫౌండేషన్ రేషన్ వితరణ

కొత్తగూడెం (ప్రశ్న న్యూస్) తాటిపల్లి లక్ష్మయ్య పుట్టినరోజు సందర్భంగా ఫ్రెండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం 28వ డివిజన్లోని నిరుపేద కుటుంబానికి నిత్యావసర సరుకులు వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా ఫ్రెండ్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సిహెచ్ శ్రీకాంత్ మాట్లాడుతూ అమ్మ ఫౌండేషన్ ద్వారా నిత్యం నిరుపేదలకు, అనాధలకు సామాజిక బాధ్యతగా ఇలాంటి కార్యక్రమాలు ఎన్నో చేపడుతున్నామన్నారు. తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని స్పష్టం చేశారు. యువత సామాజిక స్పృహతో సమాజానికి పాటుపడాలని ఆయన పిలుపునిచ్చారు

# దొడ్డి కొమురయ్య చూపిన ధైర్యం, సంకల్పం యువతకు ఆదర్శం

**- విలాసాగర్ గ్రామ సర్పంచ్ : ఏనుగుల కనుకయ్య**

**- విలాసాగర్‌లో ఘనంగా దొడ్డి కొమురయ్య 99వ జయంతి వేడుకలు**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం,విలాసాగర్ గ్రామంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య 99వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ ఏనుగుల కనకయ్యతో పాటు శ్రీకృష్ణ కురుమ యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా దొడ్డి కొమురయ్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఆయన చేసిన త్యాగాలను స్మరించుకుంటూ నాయకులు, సంఘం ప్రతినిధులు భావోద్వేగ ప్రసంగాలు చేశారు. సమాజం కోసం పోరాడిన ఆయన ఆదర్శాలను అనుసరించాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా సర్పంచ్ ఏనుగుల కనకయ్య మాట్లాడుతూ, "తెలంగాణ రైతాంగ పోరాటానికి దొడ్డి కొమురయ్య చేసిన త్యాగం చిరస్మరణీయమని, ఆయన చూపిన ధైర్యం, సంకల్పం యువతకు ఆదర్శమని" పేర్కొన్నారు. సమాజంలో అన్యాయాలకు ఎదురు నిలవడం కొమురయ్య చూపిన మార్గమని, ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని అన్నారు.ఈ కార్యక్రమంలో కురుమ సంఘం యువకులు, గ్రామ వార్డు సభ్యులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కొమురయ్యకు ఘనంగా నివాళులర్పించారు.

# అక్రమంగా ఇసుక డంపింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవు

**తాసిల్దార్ శ్రీనివాస్ చారి**



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) అక్రమంగా ఇసుక డంపింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కొల్చారం తహసిల్దార్ శ్రీనివాస్ చారి హెచ్చరించారు ఈ సందర్భంగా కొల్చారం మండల పరిధిలోని పోతంశెట్టిపల్లి శివారులో గల హనుమాన్ బండల్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇసుక డంపింగ్ చేయడంతో స్థానిక తాసిల్దార్ శ్రీనివాస్ చారి ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు స్పందించి ఇసుక డంపింగ్ చేసిన స్థలాన్ని పరిశీలించిన పోతంశెట్టిపల్లి గ్రామ పంచాయతీ అధికారి రవి మరియు తమ సిబ్బంది సిబ్బందితో కలిసి అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను సీజ్ చేసిన అధికారులు ఈ సందర్భంగా తాసిల్దార్ మాట్లాడుతూ కొల్చారం మండల వ్యాప్తంగా అక్రమంగా ఇసుక రవాణా చేసిన లేదా డంపింగ్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కొల్చారం తహసిల్దార్ శ్రీనివాస్ చారి హెచ్చరించారు .

# ఉప్పల్ మీడియా క్లబ్ నూతన కమిటీకి ఘన సత్కారం

**మీడియా ఐక్యతతో సమాజానికి మేలు**

**నూతన కమిటీకి అభినందనలు తెలిపిన పిల్లి నాగరాజు ముదిరాజ్, జితేందర్ రెడ్డి, పంగ మహేందర్ రెడ్డి, పంగ రాజేశ్వర్ రెడ్డి**



ఉప్పల్ (ప్రశ్న న్యూస్)ఉప్పల్ ప్రాంతంలో మీడియా ఐక్యతకు ప్రతీకగా నిలుస్తున్న ఉప్పల్ మీడియా క్లబ్ (ప్రింట్ ఉ ఎలక్ట్రానిక్ మీడియా) అధ్యక్షుడు వడ్డేపల్లి కిషోర్ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఉప్పల్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పిల్లి నాగరాజు ముదిరాజ్ వారి కార్యాలయంలో శుక్రవారం ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా పిల్లి నాగరాజు ముదిరాజ్, పూదూరి జితేందర్ రెడ్డి, పంగ మహేందర్ రెడ్డి, పంగ రాజేరాశ్వర్ రెడ్డి, మాట్లాడుతూ సమాజంలో మీడియా కీలక పాత్ర పోషిస్తోందని, ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే బాధ్యత మీడియాపై ఉందని తెలిపారు. మీడియా ఐక్యతతో పనిచేస్తే ప్రజలకు మరింత న్యాయం జరిగే అవకాశముందని పేర్కొన్నారు.
నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కమిటీ సభ్యులకు అభినందనలు తెలియజేశారు. నిజాయితీతో వార్తలను ప్రజలకు అందిస్తూ సమాజ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు.అదేవిధంగా ఉప్పల్ మీడియా క్లబ్ అధ్యక్షుడు వడ్డేపల్లి కిషోర్, ప్రధాన కార్యదర్శి ఆనంద నరసింహారెడ్డి లు మాట్లాడుతూ, మీడియా ఐక్యతతోనే సంస్థ బలపడుతుందని, సభ్యులందరూ కలిసి పనిచేస్తే ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించగలమని తెలిపారు. భవిష్యత్తులో మీడియా ప్రతిష్టను మరింత పెంచేలా కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పలువురు మీడియా ప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# సామాన్యుల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఇసుక లేనట్టేనా...?

## సామాన్యులకు ఒక న్యాయం ధనవంతులకు ఒక న్యాయమా?







మంథని ( ప్రశ్న న్యూస్)తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు ఆదిలోనే ఆటంకాలు ఎదురైతున్నాయి. ఇంటి నిర్మాణ పనులు లబ్ధిదారులు ప్రారంభించినప్పటికీ అందుబాటులో ఉండాల్సిన ఇసుక అందనంత దూరానికి చేరువైంది. మంథని నియోజకవర్గంలో ఒకపక్క గోదావరి మరోపక్క మానేరు నది ప్రవాహాలతో పుష్కలంగా ఇసుక నిలువలు ఉన్నప్పటికీ, ఆ ఇసుక రాజధాని ప్రాంతాలకు తరలిపోతున్నది. స్థానికంగా మంతిని నియోజకవర్గం లో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలకు ఇసుక కొరత అధికారుల తీరుతో మొదలైంది.

### అధికారుల అత్యుత్సాహం

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు మంథని మండలం విలోచవరం గ్రామంలోని గోదావరి నుండి ఉచితంగా ఇసుకను నిర్దేశించిన సమయం ప్రకారం పొందవచ్చును అంటూ జిల్లా పాలన అధికారి గతంలో ఆదేశాలు జారీ చేసినప్పటికిని ప్రస్తుతం ఆదేశాలను అధికారులు లెక్కచేయడం లేదు.
ఒకపక్క రెవెన్యూ అధికారులు కలెక్టర్ ఆదేశాల మేరకు తాము ఇసుక ట్రాక్టర్లను పట్టుకుంటున్నామని చెబుతుంటే, మరో పక్క ఫారెస్ట్ అధికారులు విలోచవరంలోని గోదావరి నది ఇసుక రీచ్ తమ ఆధీనంలోకి వస్తుందంటూ ఇసుకను ఇందిరమ్మ ఇళ్లకు తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకుంటున్నారు. ఓవైపు రెవెన్యూ శాఖ, మరోవైపు ఫారెస్ట్ అధికారుల తీరుతో లబ్ధిదారులకు ఇసుక అందనంత దూరానికి వెళ్ళిపోతుందని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇసుకను తరలించడానికి సైతం ట్రాక్టర్ యజమానులు జంకుతున్నారని లబ్ధిదారులు చెబుతున్నారు.
ఒకవేళ అధికారుల కంటపడకుండా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుకను తరలిస్తుంటే రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులు ట్రాక్టర్లను పట్టుకొని కేసులు నమోదు చేస్తూ వేలాది రూపాయల ఫైన్లు వసూలు చేస్తున్నారని ట్రాక్టర్ యజమానులు సైతం వాపోతున్నారు. దీనివలన 1200 రూపాయలకు అందవలసిన ఇసుక సుమారు 3500 రూపాయలకు పెంచి దొంగ చాటున తరలించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అధికారుల తీరుతో ఇసుక కొరత ఏర్పడి బ్లాక్ మార్కెట్ కు కారణం అవుతున్నారని, దీనివలన ఎక్కువ మొత్తంలో ఇసుకకు ఖర్చు చేయవలసిన దుస్థితి ఏర్పడుతుందని నిర్మాణదారులు తెలుపుతున్నారు. దీనికి తోడు అధికార పార్టీకి సంబంధించిన వ్యక్తులకు సంబంధించిన వ్యక్తుల ట్రాక్టర్లు అయితే ఒకరకంగా, సామాన్యులకు మరొకరకంగా అధికారులు పక్షపాత ధోరణి అవలంబిస్తున్నారని వినికిడి. ఇటీవల రెవెన్యూ అధికారులు పట్టుకున్న ట్రాక్టర్లలో కొంతమంది అధికార పార్టీకి సంబంధించిన నాయకుల ఫోన్ కాల్ తో సంబంధిత ట్రాక్టర్లను వదిలి పెట్టారని జోరుగా చర్చ జరుగుతుంది. సామాన్యులకు ఇసుక పోస్తున్నామని ప్రొసీడింగ్స్ చూపించిన అధికారులు పట్టించుకోవడంలేదని, అదే దొంగ ఇసుక కొడుతున్న ట్రాక్టర్లను మాత్రము అధికారులు పట్టుకున్న సమయంలో ప్రజా ప్రతినిధులు ఫోన్ చేయగానే ఒకే రైట్ రైట్ అంటూ అధికారులు ట్రాక్టర్లను వదిలిపెడుతున్నారని, మంథని ప్రాంతంలో జోరుగా చర్చ కొనసాగుతున్నది.
ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల కు ఇసుకకు ఇబ్బందులు సృష్టించకూడదని లబ్ధిదారులు వేడుకుంటున్నారు.

# నీలోజిపల్లి దేవాలయం భూమిపై వివాదం

# రెవిన్యూ అధికారులపై ఆగ్రహం

- గ్రామ హక్కులపై గందరగోళం - అధికారుల నిర్ణయం పై విమర్శలు
- ప్రజల అభిప్రాయాలు పక్కనపెట్టారని సర్పంచ్ భాస్కర్ మండిపాటు
- తహసీల్దార్ జారీ చేసిన సదరు ధృవీకరణ పత్రాన్ని రద్దు చేయాలని గ్రామస్తుల డిమాండ్

బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, నీలోజిపల్లి గ్రామంలో దేవాలయ భూమికి సంబంధించిన తహశీల్దార్ జారీ చేసిన సర్టిఫికేట్ తీవ్ర వివాదానికి దారితీసింది. ఈ వ్యవహారంపై గ్రామ సర్పంచ్ అనుముల భాస్కర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ భాస్కర్ మాట్లాడుతూ, "గ్రామానికి సంబంధించిన కీలకమైన అంశంలో ప్రజలను సంప్రదించకుండా, ఏకపక్షంగా సర్టిఫికేట్ ఇవ్వడం సరైంది కాదు. ఇది గ్రామ హక్కులను దెబ్బతీసే చర్య" అని అన్నారు.దేవాలయం నిర్మాణం,నిర్వహణపై ఒక వ్యక్తి పేరును ప్రస్తావిస్తూ సర్టిఫికేట్ ఇవ్వడాన్ని ఆయన ప్రశ్నించారు. "దేవాలయం గ్రామస్తుల సమిష్టి కృషితో కొనసాగుతుంది. దాన్ని వ్యక్తిగతంగా చూపించడం పలు అనుమానాలకు తావిస్తోంది" అని పేర్కొన్నారు.అలాగే, ఈ విషయంపై పూర్తిస్థాయి విచారణ జరిపి నిజాలు బయటపెట్టాలని,లేని యెడల ఉన్నతాధికారులను ఆశ్రయిస్తామని హెచ్చరించారు. "ప్రజల హక్కుల కోసం ఎంతవరకైనా పోరాడతాం" అని స్పష్టం చేశారు.ఈ ఘటనతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అధికారులు స్పందించి జారీ చేసిన సర్టిఫికెట్ ను రద్దు చేసి,సమస్యను పరిష్కరించాలని పలువురు గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.


GOVERNMENT OF TELANGANA
REVENUE DEPARTMENT
Office of the Tahsildar
CERTIFICATE
Hence it is Certified
Yours faithfully
Tahsildar



# నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం పద్మ దేవేందర్ రెడ్డి



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) పాపన్నపేట మండల బిఆర్ఎస్ నాయకులు,మిన్పూర్ మాజీ ఎంపీటీసీ బీస. గోపాల్ కుమారుడు సంతోష్ కుమార్ వివాహం సుధారాణితో మండల కేంద్రంలోని మంజీరా గార్డెన్ శుక్రవారం ఘనంగా జరిగింది. అదేవిధంగా ఎంకేపల్లి గ్రామానికి చెందిన బద్రి లక్ష్మణ్ కూతురు వివాహం పొలంపల్లి పెంటయ్య ఫంక్షన్ హాల్ సంగాయ పేట్ లో జరిగింది, మరియు అబ్లాపూర్ గుండయ్య కుమారుడి వివాహం కొత్తపల్లిలోని అనంత పద్మనాభ స్వామి ఫంక్షన్ హాల్లో జరిగింది. ఈ వివాహ వేడుకల్లో మాజీ డిప్యూటీ స్పీకర్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు యం. పద్మాదేవేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరి.సుభాష్ రెడ్డి, మండల నాయకులతో కలిసి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. వీరి పాపన్నపేట మండల పార్టీ అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ సర్పంచ్ ల ఫోరం మండల అధ్యక్షులు జగన్, రైతుబంధు మాజీ అధ్యక్షులు సోములు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్ రెడ్డి, రామతీర్థం సర్పంచ్ సాయి రెడ్డి, మాజీ సర్పంచ్ లు శ్రీనాథ్ రావు, బద్రి. మల్లేశం, నాయకులు దుర్గయ్య, అనిల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# దొడ్డి కొమురయ్య త్యాగం తెలంగాణ ప్రజలకు దిక్సూచిగా నిలిచింది

**- బోయినిపల్లి ఏఎంసీ చైర్మన్ : బోయిని ఎల్లేష్ యాదవ్**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)బహుజనుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన,నిజాం నిరంకుశ పాలనకు ఎదురు నిలిచి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో తొలి అమరుడిగా నిలిచిన స్వర్గీయ దొడ్డి కొమురయ్య జయంతిని పురస్కరించుకొని శుక్రవారం బోయినిపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్ ఆయనకు ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,దొడ్డి కొమురయ్య చేసిన త్యాగం తెలంగాణ ప్రజలకు దిక్సూచిగా నిలిచిందని అన్నారు. సమాన హక్కులు, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన పోరాటం తరతరాలకు మార్గదర్శకమని పేర్కొన్నారు.అణగారిన వర్గాల అభివృద్ధి, సమానత్వం సాధనలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని పిలుపునిస్తూ, కొమురయ్య ఆశయాలను కొనసాగించడం ద్వారానే ఆయనకు నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని అన్నారు.

## దొడ్డి కొమురయ్య పోరాట స్ఫూర్తి

# మనందరికీ ఆదర్శం

**జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) దొడ్డి కొమురయ్య పోరాట స్ఫూర్తి ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయం అని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన దొడ్డి కొమురయ్య 99వ జయంతి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్ వెనుకబడిన తరగతుల సహాయ అభివృద్ధి అధికారి శ్రీనివాస్ , సంఘ నాయకులు యాదగిరి, తో కలిసి దొడ్డి కొమురయ్య చిత్రపటానికి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ దొడ్డి కొమురయ్య తెలంగాణ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించిన మహానుభావుడని తెలిపారు.

అణచివేతలకు వ్యతిరేకంగా ప్రజల హక్కుల కోసం ప్రాణత్యాగం చేసిన తొలి అమరుడిగా ఆయన చరిత్రలో నిలిచారని పేర్కొన్నారు. కొమురయ్య చూపిన ధైర్యం, త్యాగం, పోరాట స్ఫూర్తి నేటి యువతకు మార్గదర్శకమని అన్నారు. ప్రజల హక్కులు, సమానత్వం కోసం ఆయన చేసిన త్యాగాలను స్మరించుకుంటూ, ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టడం ద్వారానే నిజమైన నివాళి అర్పించినవారమవుతామని తెలిపారు. సమాజంలో న్యాయం, సమానత్వం నెలకొల్పేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. మహనీయులను కులం, వర్గం అనే పరిమితుల్లో చూడకుండా వారి ఆశయాలను అందరూ ఆదర్శంగా తీసుకొని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో , బీ.సీ సంఘాల ప్రతినిధులు, ,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘట్కేసర్ మున్సిపల్ పరిధిలో

# అక్రమ నిర్మాణాల జోరు

- 2 అంతస్తుల రెసిడెన్షియల్ పర్మిషన్ 5 అంతస్తుల అక్రమ సెల్లార్ తో నిర్మాణం
- పూర్తిస్థాయిలో నోటీసులు ఇచ్చి కూడా చర్యలు మరచిన అధికారుల పై అవినీతి ఆరోపణలు
- అక్రమ నిర్మాణాలలో టౌన్ ప్లానింగ్ అధికారుల అవినీతికి అంతం లేదా.?

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రాంపల్లి ప్రాంతంలో అక్రమ నిర్మాణాలు రోజు రోజుకు విస్తరిస్తూ ఆందోళన కలిగిస్తున్నాయి. ఎలాంటి అధికారిక అనుమతులు లేకుండానే భారీ స్థాయిలో అక్రమ నిర్మాణాలు, షెడ్లు జరుగుతుండటం స్థానికుల్లో తీవ్ర అసంతృప్తిని రేకెత్తిస్తోంది. ముఖ్యంగా ఎలాంటి అనుమతులు లేకుండా భారీ కన్వెన్షన్ హాల్ నిర్మాణం జరుగుతున్న విధానం అనేక అనుమానాలకు తావిస్తోంది. దానితోపాటు రహదారిపై ఎక్సైడ్ బ్యాటరీ దుకాణం పక్కకు అక్రమ సెల్లార్, అక్రమ అంతస్తులతో మున్సిపల్ నియమ నిబంధనలను పూర్తిగా పక్కన పెట్టి ఈ నిర్మాణాలు సాగుతుండటం గమనార్హం.
ఇదే ప్రాంతంలో అనుమతులు లేకుండా భారీ షెడ్ నిర్మాణాలు అనుమతులు లేకుండా నిర్మించబడుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. పార్కింగ్ సౌకర్యాలు లేకుండా, ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించకుండా రెసిడెన్షియల్ అనుమతులతో కమర్షియల్ నిర్మాణాలు కొనసాగుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇది భవిష్యత్తులో ట్రాఫిక్ సమస్యలకు, విద్యుత్ డ్రైనేజ్ భద్రతకు ప్రమాదకరమని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

### అధికారుల సహకారమే కారణమా.?

ఘటకేసర్ సర్కిల్ పరిధిలో జరుగుతున్న అనేక భారీ అక్రమ నిర్మాణాలకు అధికారుల కనుసైగలతోనే జరుగుతోందని స్థానికులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. నిర్మాణం ప్రారంభం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి నోటీసులు ఇవ్వకపోవడం, పనులు ఆపకపోవడం వెనుక ఇబ్బంది, అధికారుల పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. టౌన్ ప్లానింగ్ అధికారుల సహకారం లేకుండా ఇంత పెద్ద నిర్మాణం అసాధ్యం అని ప్రజలు బహిరంగంగానే చెబుతున్నారు. చైన్ మెన్ లకు, అధికారులకు లక్షల్లో మామూళ్లు అందాయని అందుకోసమే అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### టౌన్ ప్లానింగ్ సిబ్బంది అధికారులపై మామూళ్ల ఆరోపణలు

నాగారం మున్సిపల్ పేరు వినిపిస్తోంది
ఈ నిర్మాణానికి సంబంధించి గతంలో నాగారం మున్సిపల్ అధికారులకు భారీగా మామూళ్లు అందినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. అక్రమ నిర్మాణాలకు సంబంధించిన వ్యవహారలలో లంచాలు కీలక పాత్ర పోషించాయని స్థానికంగా ప్రచారం జరుగుతోంది. ఘట్కేసర్ టౌన్ ప్లానింగ్ అధికారుల అవినీతిపై వస్తున్న ఆరోపణలపై కమిషనర్ విజిలెన్స్ విచారణ చేయిస్తే పెద్ద స్థాయి అవినీతి కుంభకోణం బయటపడే అవకాశం ఉందని స్థానికులు సూచిస్తున్నారు.

### ప్రభుత్వ ఆదాయానికి గండి

ఘట్కేసర్ సర్కిల్ పరిధిలో
అక్రమంగా నిర్మాణాలు జరగడం వల్ల ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం కోట్లలో కోల్పోతున్నది. బిల్డింగ్ పర్మిషన్ ఫీజులు, డెవలప్‌మెంట్ ఛార్జీలు, పన్నులు ఇవి అన్ని ఎగ్గొట్టబడుతున్నాయని దీంతో ప్రజల సొమ్ము నష్టం చెందుతుండగా, అక్రమంగా నిర్మాణం చేస్తున్నవారికి, మున్సిపల్ అధికారులకు మాత్రం భారీగా లాభాలు కురుస్తున్నాయి.

### కూల్చివేతల చర్యలు ఎప్పుడు.?

ఇంత పెద్ద స్థాయిలో రాంపల్లి చౌరస్తా రహదారిపై అక్రమ నిర్మాణం జరుగుతున్నా ఇప్పటివరకు మున్సిపల్ అధికారులు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోకపోవడం ప్రజలను ఆగ్రహానికి గురి చేస్తోంది. నోటీసులు పూర్తిగా ఇచ్చేసాం కూల్చి వేస్తాం అంటూ కాలక్షేపం చేయడం అధికారుల అవినీతిని బహిర్గతం చేస్తుంది. వెంటనే నిర్మాణాన్ని నిలిపివేసి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

### అవినీతికి నిలయంగా మారుతున్న మున్సిపల్ కార్యాలయం

ఘట్కేసర్ సర్కిల్ కార్యాలయం రోజురోజుకూ అవినీతికి కేంద్రబిందువుగా మారుతున్నదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సాధారణ ప్రజలు చిన్న పనుల కోసం తిరుగుతుంటే, భారీ అక్రమ నిర్మాణాలకు మాత్రం అధికారులు సహకరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మామూళ్లు తీసుకొని అక్రమ నిర్మాణదారులకు అండగా నిలుస్తున్నారని చిన్న ఇల్లు కట్టే పేదవానిపై ప్రతాపం చూపుతున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా టౌన్ ప్లానింగ్ అధికారులు ఈ వ్యవహారం చేయడం చర్చనీయాంశంగా మారింది.

### ఉన్నతాధికారులు స్పందించాలి

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవడంలో ఉన్నత అధికారులు పూర్తిగా విఫలం చెందడంతో కిందిస్థాయి సిబ్బంది అధికారులు భారి స్థాయిలో అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారు.
ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించి పూర్తి స్థాయి విచారణ జరపాలని ప్రజలు కోరుతున్నారు. అక్రమ నిర్మాణాలను కూల్చివేసి, అవినీతి అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటేనే ప్రజల్లో మున్సిపల్ శాఖ పై, కాంగ్రెస్ ప్రభుత్వంపై నమ్మకం పెరుగుతుందని విశ్లేషకుల నుండి అభిప్రాయం వ్యక్తమవుతోంది.




## కోర్టు ఆదేశాలు పట్టించుకోని

# మున్సిపల్ అధికారులు

- అక్రమ అంతస్తులు సీజ్ చేయాలన్న పట్టించుకోని మైనం
- అధికారుల లంచాల దాహానికి జిహెచ్ఎంసి నిబంధనలు బేఖాతర్
- జిహెచ్ఎంసి ఆదాయానికి గండి కొడుతున్న సిబ్బంది, అధికారులు
- న్యాక్ ఇంజనీర్ అవినీతి పై స్థానికుల ఆందోళన




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ నగరంలోని సరూర్‌నగర్ పరిధిలో కోర్టు ఆదేశాలను టౌన్ ప్లానింగ్ అధికారులు బేకతార్ చేస్తున్న అక్రమ నిర్మాణం వెలుగులోకి వచ్చింది. గడ్డియన్నారం, మధురాపురి కాలనీలోని ప్లాట్ నం.15/బి, హౌస్ నం.13-7-60లో నిర్మాణానికి సంబంధించి బిల్డింగ్ పర్మిషన్ నెంబర్: 000382/ జిహెచ్ఎంసి /00372/ ఏబిపి /జ5/2025, పర్మిట్ నెంబర్ : 0543/జిహెచ్ఎంసి/× ఎ/సి5/2025 తో కేవలం స్టిల్ట్ ం 2 అంతస్తులు మాత్రమే నిర్మించేందుకు అనుమతి తీసుకున్నారని అయితే ఈ అనుమతులను అతిక్రమిస్తూ 3వ, 4వ, 5వ అంతస్తులను అక్రమంగా నిర్మించినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ అక్రమ నిర్మాణం సరూర్ నగర్ సర్కిల్-12, ఎల్బీనగర్ జోన్ మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోకి వస్తుందని ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని కోర్టు ఆదేశాల ధిక్కరణ జరుగుతున్న జోనల్ కమిషనర్, మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోంది.

### సీజ్ చేయాలని కోర్టు ఆదేశాలు పట్టించుకోని ఏసిపి, టిపిఎస్

ఈ అక్రమ నిర్మాణంపై విచారణ జరిపిన కోర్టు, 2026 మార్చి 24లోపు భవనాన్ని సీజ్ చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ, సర్కిల్ 12 టౌన్ ప్లానింగ్ అధికారులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. అధికారులు ఎంత భారీ స్థాయిలో లంచాలు తీసుకున్నారో అందుకోసమే చర్యలు తీసుకోవడం లేదంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### అధికారుల నిర్లక్ష్యం వెనుక అవినీతి ఉందా.?

సర్కిల్ 12 పరిధిలో జరుగుతున్న అనేక అక్రమ నిర్మాణాలపై న్యాక్ ఇంజినీర్ సురేష్ హస్తం ఉందని ఆయన వ్యవహార శైలి అనేక అనుమానాలకు తావిస్తోంది, విధులను సక్రమంగా నిర్వహించడం లేదని, ఆయనపై కూడా అవినీతి ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆయన పాత్రపై విజిలెన్స్ అధికారులచే సమగ్ర విచారణ జరిపి, అవసరమైతే కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.




### జోనల్ కమిషనర్ నిర్లక్ష్యం వల్లే ఈ అవినీతా.?

ఎల్బీనగర్ జోన్ పరిధిలో జరుగుతున్న అనేక అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవడంలో జోనల్ కమిషనర్ పూర్తిగా విఫలం చెందారన్న విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. కోర్టు ఆదేశాలు అమలు కాకపోవడ అక్రమ నిర్మాణాలు పెరుగుతుండటం, ప్రజల్లో న్యాయంపై నమ్మకాన్ని దెబ్బతీస్తుందా.? జోనల్ కమిషనర్ ఉన్నత అధికారులు తక్షణమే స్పందించి ఈ అక్రమ నిర్మాణాన్ని సీజ్ చేసి సహకరించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## హర్మూజ్ జలసంధిని తెరవగలిగితే

# ఇక చమురు వెల్లువే

- భారీగా సంపద సృష్టిస్తామన్న ట్రంప్




న్యూయార్క్ (ప్రశ్న న్యూస్) గల్ఫ్ ప్రాంతంలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. హోర్ముజ్ జలసంధిని తిరిగి తెరిచి, చమురుతో భారీగా సంపద సృష్టించవచ్చని ఆయన అన్నారు. ఇది ప్రపంచానికి ఒక 'జాక్‌పాట్' అవుతుందని సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. "మరికొంత సమయం ఇస్తే, మనం సులభంగా హర్మూజ్ జలసంధిని తెరవవచ్చు, చమురును తీసుకోవచ్చు, భారీగా సంపద కూడబెట్టవచ్చు. ఇది ప్రపంచానికి ఒక వరం అవుతుంది కదా?" అని ట్రంప్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఆయన వ్యాఖ్యలు వెలువడుతున్న తరుణంలోనే, సముద్రయాన ఇంటెలిజెన్స్ సంస్థ 'విండ్‌వార్డ్' తాజా డేటాను విడుదల చేసింది. ఏప్రిల్ 1న 16 నౌకలు ఈ జలసంధిని దాటాయని, అంతరాయం తర్వాత నౌకల రాకపోకలు జరగడం ఇది వరుసగా మూడో రోజని తెలిపింది.గత మార్చి మధ్యలో ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్జీసీ) పర్యవేక్షణలో తప్పనిసరి నావిగేషన్ కారిడార్‌ను అమలులోకి తెచ్చింది. దీంతో అనేక నౌకలు తమ మార్గాలను మార్చుకోవాల్సి వచ్చింది. అయితే, ఇటీవల ఒమన్‌కు చెందిన రెండు ఆయిల్ ట్యాంకర్లు, సోహార్ అనే ఒక ఎల్ఎన్జీ క్యారియర్.. ఇరాన్ నియంత్రిత మార్గాన్ని తప్పించుకుని అంతర్జాతీయ జలాల్లోకి ప్రవేశించాయి. ఉద్రిక్తతలు పెరిగాక ఈ జలసంధిని దాటిన తొలి ఎల్ఎన్జీ క్యారియర్ ఇదే కావడం గమనార్హం. ఫ్రాన్స్‌కు చెందిన సీజీఏం సంస్థకు సంబంధించిన ఒక కంటైనర్ నౌక కూడా ఈ మార్గం గుండా ప్రయాణించింది. ఆంక్షల తర్వాత ఒక పాశ్చాత్య దేశానికి చెందిన నౌక ప్రయాణించడం ఇదే మొదటిసారని నిపుణులు చెబుతున్నారు. ఈ ప్రాంతంలో సుమారు 25 శాతం నౌకల యజమానుల వివరాలు తెలియకపోవడం నిఘాను సంక్లిష్టంగా మారుస్తోందని విశ్లేషకులు అంటున్నారు.

# మొదట్లోనే తప్పు చేసిన విజయ్

- రెండు నామినేషన్లలో వేర్వేరు వివరాలు



చెన్నై (ప్రశ్న న్యూస్) తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో నటుడు, టీవీకే పార్టీ అధ్యక్షుడు విజయ్ రెండు నియోజకవర్గాల నుంచి పోటీ చేస్తున్నారు. ఆయన పెరంబూర్, తిరుచ్చి ఈస్ట్ స్థానాల్లో నామినేషన్ దాఖలు చేశారు. ఆయన రెండుచోట్ల దాఖలు చేసిన ఎన్నికల అఫిడవిట్‌లలో తేడాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఎన్నికలకు ముందు ఈ వ్యవహారం న్యాయపరిశీలకు దారి తీసే అవకాశం ఉందనే వాదనలు వినిపిస్తున్నాయి. పెరంబూర్, తిరుచ్చి ఈస్ట్ అసెంబ్లీ స్థానాల కోసం రూపొందించిన అఫిడవిట్‌లలో పెండింగ్ క్రిమినల్ కేసులు, ఎన్నికల బ్యాంకు ఖాతాలకు సంబంధించిన వివరాల్లో తేడాలు ఉన్నట్లు తెలుస్తోంది. పెరంబూర్ ఎన్నికల అఫిడవిట్‌లో తనపై ఎలాంటి కేసులు లేవని పేర్కొన్న విజయ్, తిరుచ్చి ఈస్ట్ కోసం సమర్పించిన అఫిడవిట్‌లో పెండింగ్‌లో రెండు ఎఫ్ఐఆర్‌లు ఉన్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల ఖర్చు కోసం ఒక బ్యాంకు ఖాతాను తెరిచామని, ఇందులో రూ.1 లక్ష ఉన్నట్లు పెరంబూర్ అఫిడవిట్లో పేర్కొన్న విజయ్, తిరుచ్చి అఫిడవిట్లో రెండు బ్యాంకు ఖాతాలు ఉన్నట్లు తెలిపారు.

## తెలంగాణలో మూడు రోజుల పాటు

# మోస్తరు వర్షాలు

- పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్రంలో రానున్న మూడు రోజుల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. రాష్ట్రంలోని పలు జిల్లాలకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం ఎల్లో అలర్ట్ జారీ చేసింది. శుక్రవారం ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. శనివారం ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, జగిత్యాల, సిరిసిల్ల, జనగామ జిల్లాల్లో వర్షం పడవచ్చని, ఆదివారం ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, జగిత్యాల, సిరిసిల్ల, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి, జనగామ జిల్లాల్లో వర్షం కురిసే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588